Registered No. 1118

విడిపత్రిక అణా.

ఆంధ్రపత్రిక

Founder
K. NAGESWARA RAO

ANDHRA PATRIKA

Editor
S. SAMBHU PRASAD

Vol. 29 ★ మదరాసు 3-5-42 ఆదివారము MADRAS, SUNDAY MAY 3, 1942 ★ No. 33

భావసంచారి
తమాషా-ఖులాసా

మాండలే జపాను సేనల ఆక్రమణ?

రాజగోపాలాచారి తీర్మానము - భారత కాంగ్రెసు సంఘ నిరాకరణము

పాకిస్థాను ఇస్లాముకు విరుద్ధము

—మౌలానా అజదు

యుద్ధోపద్రవమువల్ల మద్రాసు ప్రత్యేకింపబడ వచ్చునని సి. ఆర్. హెచ్చరిక

తీర్మాన ముపపాదించుటలోని ఉద్దేశము నెహ్రూ తీవ్రముగ ఖండించుట

రాజగోపాలాచారిగారు అవలంబించినవిధానమునకు రాష్ట్రపతి అసమ్మతి

అత్యధికసంఖ్యాకులచే జగతు నారాయణలాలుగారి ప్రతి తీర్మానము ఆమోదింపబడుట

అలహాబాదు, మే 2:—

నేటిదినం శ్రీ సి. రాజగోపాలాచారి గారి తీర్మానమును నిరాకరించుటతో అఖిల భారత కాంగ్రెసు సంఘసమావేశము ముగిసెను. భారతదేశ విభజనకు కాంగ్రెసు ఎంత మాత్రము అంగీకరింపదని జగతు నారాయణలాలుగారు రుపపాదించిన తీర్మానము అత్యధిక సంఖ్యాకులచే ఆమోదింపబడెను.

ఈ రెండు తీర్మానముల మీదను 3 గంటలకాలము చర్చజరిగెను. పండిత నెహ్రూ, రాజేంద్రప్రసాదు మున్నగువారలు తీర్మానమునకు ప్రతికూలముగ మాట్లాడిరి.

సభను ముగించుచు అజదుగారు మాట్లాడిరి. తీర్మానమును బహిరంగపరచు విషయమున రాజగోపాలాచారిగారు అనుసరించిన విధానమునకు ఖండించిరి.

ముస్లింలీగువారితో సంభాషణలు జరిపి రాజీ కుదుర్చుకొనుటకు కాంగ్రెసు ఎల్లప్పుడు సిద్ధముగ నున్నదనియు, ముస్లింలీగు ప్రతినిధులు 5 మందితో సంప్రదింపులు జరుపవర్కింగుకమిటి సభ్యులను 5 మందిని నియమింప తాను సిద్ధముగ నున్నట్లు రాష్ట్రపతి ప్రకటించెను.

మద్రాసులో మంత్రివర్గము నేర్పరచు విషయమై మద్రాసులాసనసభ్యుల సమావేశములో ఆమోదింపబడిన రెండవ తీర్మానమును రాజగోపాలాచారిగారు రుపపాదించలేదు.

నేడు ఉదయమున భారత కాంగ్రెసు సంఘసభలో మదరాసు తీర్మానాలకు రుపపాదిస్తూ సి. రాజగోపాలాచారిగారి రీలాగు రుపన్యసించారు.

క్షీరసాగర మథనము

"నేనీతీర్మానములను యీసభలో రుపపాదించకమానని నిమ్మర్వగాఅభ్యర్థునితో తెలిపినందువల్లను నా ప్రోత్సాహంవల్లనే యీతీర్మానములు మదరాసుసభలో ఆమోదించబడినందువల్లను ఈ తీర్మానములు మదరాసుసభలో ఆమోదించబడినందువల్లను కాంగ్రెస్ నాయకులకున్నూ యితర జాతీయ పక్షాల నాయకులకున్నూ కూడా నామీద చాలా ఆగ్రహము కలిగిందని నాకు బాగా తెలిసేవుంది. ఈ విషయమును మన ప్రాచీనులు అనేక యుగాలకు పూర్వమే తెలుసుకొనివున్నారనటకు మన పురాణాలలోని క్షీరసాగర మథన వృత్తాంతమే మనకు ప్రబలనిదర్శనముగా వున్నది. దేవతలు అమృతము లక్ష్మీదేవి, కటాక్షమును బడయగోరారు. దేవతలు తమకు విరోధులైన దానవులకు నచ్చజెప్పి వారు తోడుకలసి క్షీరసాగరములను మథించారు. వారు అమృతం కోసము దీనిని మథిస్తే మొదట కాలకూట విషమే పుట్టింది. రుద్రదేవుడు పానం చేశాడు. ఈ కథలోని సత్యములు నాకిప్పుడు బాగా అనుభవంలోకి రాబట్టి నేనీ కథనీ సభలో చెబుతున్నాను గాని నా పాండిత్యమును వెల్లడించుటకోసము చెప్పడము లేదు. అప్పుడు దేవతలు తమకు శత్రువులైన దానవుల సహాయమును కోరారు. ఇప్పుడు మనము మనమిత్రుల సహాయమునే కోరుతున్నాము. ఇప్పుడు నాపట్ల ప్రజలకందరికి చాలా ప్రతికూలభావము కలుగడమే కాలకూటవిషము పుట్టుటవంటిది. మనమూ హిందూ ముస్లింమైత్రిని స్వపరిపాలనమును కోరుతున్నాము. ఇది అమృతమును శ్రీ మహాలక్ష్మీ దేవియనుగ్రహమును బడయగోరుట వంటిదే. అప్పుడా విషమును రుద్రదేవుడు తాగి జీర్ణంచేసుకొన్నాడు. ఈ విషమును తాగడానికి నేను రుద్రదేవుడను కాను. దానిని కాంగ్రెసువారే పానము చెయ్యగలరు. ప్రజల ప్రతికూల భావమనే విషమును వారు పానము చేసి జీర్ణము చేసుకోగలరు. రుద్రదేవుడు తన మూడవకంటితో దానిని తాగేసినట్లే కాంగ్రెసువారు తమమూడవకంటితో దీనిని పానము చెయ్యవలెను.

హరిజనుల దేవాలయ ప్రవేశము

ప్రజల ప్రతికూలభావమునకు కాంగ్రెసు వారిదివరకు చాలాసారులు గురిఅయినారు. కాని వారు చలించలేదు. మదరాసు ప్రెసిడెన్సీలో హిందువులందరు తమ పూర్వాచార పరత్వమును వదులుకొని హరిజనులనుకూడా బాహాటముగా దేవాలయములలోనికి రానీయవలెనని నేను యిదివరకు ప్రచారముచేసి యుండలేదా? ఇప్పటినలెనే అప్పుడుకూడా వీరందరు నన్ను తీవ్రముగా నిరసించలేదా? అయితేనేమి హరిజనులనుకూడా అన్ని దేవాలయములలోనికిన్నీ రానీయవలసిందే అని యిప్పుడు మిక్కిలి హెచ్చుమంది అంగీకరిస్తూనే వున్నారు.

ఖిలాఫతు ఆందోళనము ముస్లిములకు బలము

ఖిలాఫతు ఆందోళనము మనకెంత మాత్రమూ సంబంధించక పోయినాకూడా మన దేశీయులు దానిలో పాల్గొని చాలా కష్టాలనుభవించారు. అప్పటినుంచే ఇండియాలో ముస్లిములకు బలమధికము కావడము ప్రారంభమయింది. మనదేశంలో యే మతమువారికైనా బలమధికమైన యడల అందులకు మన మందరమూకూడా సంతోషించవలసిందే. నా సూచనవల్లనే ఇండియాలో ముస్లిములకు బలమధికమైన యడలను వారి రాజకీయ సంస్థలన్నూ, వారి చైతన్యమునున్నూ (క్వాయిడ్ ఎ ఆజమ్) బహుపడిన యడలను అందులకు మన దేశీయులెవరూకూడా విచారమును పశ్చాత్తాపమును వెల్లడించగూడదు. మన దేశములో ప్రతి మతమునకున్నూ ప్రతిపక్షమునకున్నూ కూడా బలము చాలా అధికము కావలెను. ఇందుకు అన్ని మతాలవారున్నూ అన్ని పక్షాలవారున్నూ వకరికొకరు సహాయము చేస్తూ వుండవలెను. ఇందువల్ల సహాయము బడసిన సంఘములకున్నూ, సహాయము చేసిన సంఘములకున్నూ కూడా బలము చాలా అధికమవుతుంది.

నిర్వ్యాపారముతోకూడిన ధాష్టీకము

ప్రజలు నిర్వ్యాపారులుగావుండి ధాష్టీకములను చెలాయించుట కిది తగినసమయము కాదు. గనుక నే నిప్పుడు తొందరపడి యీ తీర్మానాలను సిద్ధపరిచాను. లేకపోతే నేను వీటిని సిదపరచి వుండను.

మనము ముస్లిములకు వారుకోరినవాటి నియ్యవలెను

ముస్లిములీగువారు కోరుతున్నవాటినన్నిటిని మనము వెంటనే వారికియ్యవలెను. వారికోరికలకు మన అంగీకరించుటవల్ల వారికి నిజమైన ఫలితమెంతమాత్రము కలగదు. ఇది కేవలము ఛాయాస్వరూపమేగాని ప్రత్యక్ష స్వరూపముకాదు కాని ముస్లిములీగువారు దుర్భుద్ధులు లోలైనందున దీనినిగ్రహించగ్గ గడవము లేదు. వారు కోరినవాటినన్నిటి వారికి మనమిచ్చివేస్తే అవి కేవలము నిరుపయోగమైన వన్నవిషయములను వారు తెలుసుకోగలుగుతారు. అప్పుడు వారే వీటిని తిరస్కరిస్తారు. గనుక యీ పొట్లాములను మనము బల్లమీద పడవేయవలెనుగాని మన చేబులో దాచివుంచగూడదు

ప్రశ్న:—ఇండియాలో ముస్లిము లీగు వారుమాత్రమే దీనిని కోరుతున్నారా? లేక ముస్లిములందరూ కూడా దీనిని కోరుతున్నారా?

ముస్లిములీగుకు ముస్లిములమీద అత్యధికమైన పలుకుబడి

రా— ఈప్రశ్నను చాలామంది మొదటి నుంచీ అడుగుతూనే వున్నారు. ఇది అందరికీ బాగా తెలిసేవుంది. దీనికిజవాబు కూడా అందరికి తెలిసేవుంది. ఇండియాలో అత్యధిక సంఖ్యాకులైన ముస్లిములకు ముస్లిము లీగుపట్ల అధికమైన విశ్వాసమువుంది. ఈ పలుకుబడిని తొలగించడం సులభమైన పని కాదు.

నెహ్రూగారిపై సవాలు

నెహ్రూగారు—ఇది నిజముకాదు.

రా— ఇది నిజముకాదని నెహ్రూగారన్నారు. నెహ్రూగారు ఫలితములను చూపించగలరా? అని నేను సవాలు చేస్తున్నాను. నెహ్రూగారు సాంఘిక సమస్యను పరిష్కరించగలిగినట్లయితే నేను నెహ్రూగారి పాదాలకు సాష్టాంగ సమస్కారము చేస్తాను.

మనమెంత చెప్పినా ముస్లిములు వినరు

మనము ధైర్యముతో ముస్లిము లీగును యెదుర్కొనవలెను. ఇటుపైని ఇండియాలో ముస్లిముల హక్కులు భంగపరచబడవన్న గట్టి నమ్మకము తమకు కలగవలెనని ముస్లిము లీగువారు కోరుతున్నారు. పాకిస్తానును కోరడమువల్ల యేమిలాభము కలుగదని మనము ముస్లిములతో వాదిస్తే వారు వినరు.

అజ్ఞానపు పట్టుదల

మనలో వకరు వెంటనే ట్రెయిను కందుకోవడానికి కారులో తనయింటివద్దనుంచి స్టేషనుకు వెళ్లడానికి సిద్ధంగావున్న సమయములో అతని కొడుకు చిన్నపిల్లవాడు తన కారులో డ్రయివరు పక్కనే కూర్చోవాలని పట్టువడితే అతడేమి చేయవలెను. అపుడాపిల్లవానితో వాదిస్తూవుంటే యీలోగా ట్రెయిను వెళ్లిపోతుంది. ఆ వాదన సహేతుకంగావున్నా అపిల్లవానికి నచ్చదు గనక వాని కోరిక కంగీకరించక తప్పదు. (సవ్వు)

స్వయం నిర్ణయాధికారము నకంగీకరిస్తే సమాధానము కుదురుతుంది

ఇండియాలో ముస్లిముల జనసంఖ్య మిక్కిలి హెచ్చుగావున్న రాష్ట్రాలలో వారికి స్వయంనిర్ణయాధికార ముండవలెను. ఆ రాష్ట్రాలలో తమ కిష్టమైన రాజ్యాంగ విధానమును నెలకొల్పుటకు వారికి హక్కు వుండవలెను అని అందరు కూడా అంగీకరించేవున్నారు. కాంగ్రెసువారు దీని కంగీకరించి ముస్లిములీగువారితో రాయబారమును జరిపిన యడల హిందువులకు ముస్లిములకు సమాధానము కుదురుతుంది. వివరాలను గురించి రెండు పార్టీల నాయకులు కలసి ఆలోచించవచ్చును.

ఇది నా కొత్త సూచనకాదు

ప్రస్తుతము ఇండియాలో ప్రజలలో విభేదాలు తొలగకపోతే దేశానికి అధికమైన హానికలగదా? ఇది నా కొత్త సూచనకాదు. ఢిల్లీ తీర్మానములోను, గత నెలలో మహాత్ముడు హరిజనులో ప్రకటించిన వ్యాసములలోనుకూడా దీనివిషయములో నాకు చాలాఆధారాలున్నాయి. "వకరాష్ట్రంలో ప్రజలలో మిక్కిలి హెచ్చుమంది ఇండియా యూనియనులో చేరుట కంగీకరించనియడల దానిలో చేరకతప్పదని వారిని నిర్బంధించడానికి వీల్లేదు, అనే వాక్యము ఢిల్లీతీర్మానములోవుంది" ఇండి

(2 వ పేజీ చూడుడు)

యుద్ధమునకు పూర్వము ఆటవస్తువులు తయారగు ఫ్యాక్టరీలలో నేడు యుద్ధసామగ్రులు తయారగుచున్నవి. ఒక ఫ్యాక్టరీని జార్జి రాజుగారు తనిఖీచేయు సందర్భమున అచ్చట తయారుచేయబడిన ఎలెక్ట్రికు టార్చిని రాజుగారు పరిశీలించుటను ఈ దృశ్యము చూపుచున్నది.

కాంగ్రెసు: యుద్ధము

సహాయనిరాకరణ అంతరార్థం

డా॥ పట్టాభిగారి వివరణ

గాంధిజీ ముసాయిదా అనుకరణ

(మా ప్రత్యేక విలేఖరి)

అలహాబాదు, మే 2:—

నిన్న భారత కాంగ్రెసు సంఘ సభలో భారత కాంగ్రెసు కార్యసంఘమువారు రుపపాదించిన తీర్మానముయొక్క ప్రాముఖ్యతను గురించి నేను డాక్టరు భోగరాజు పట్టాభి సీతారామయ్య పంతులుగారి నడిగాను. వారు నాతో యీలాగు చెప్పారు.

మొదటిసారి దౌర్బల్యం

పూనాకు బొంబాయికి వెనక యెటువంటి సంబంధంవుందో ఢిల్లీకి అలహాబాదుకు అటువంటి సంబంధంవుంది. పూనాలోనే భారతకాంగ్రెసు సంఘంవారు మొదటిసారి దౌర్బల్యమును కనబరిచారు. కాని రాజప్రతినిధి వెంటనే అనగా 1940 ఆగస్టులో చేసిన ప్రకటనలో పూనాలో కాంగ్రెసు సూచనలను పూర్తిగా తిరస్కరించాడు. పూనాలో తమకు కలిగిన ఆకర్షణలవల్ల తామాశించిన ఫలితము కలగకపోవుటవల్ల కాంగ్రెసువారు మళ్లీ తమ పాతనాయకుడైన గాంధీజీవద్దకే వచ్చారు. మీరే మళ్లీ నాయకత్వమును వహించి కాంగ్రెసును నడిపించవలెనని వారు గాందీజీని కోరారు.

రెండవసారి దౌర్బల్యం

సర్ స్టాఫర్డు క్రిప్సుగారు హరాత్తుగా యిండియాకు రావడంవల్ల భారతకాంగ్రెసు వారికి మళ్లీ ఆకర్షణలు కలిగాయి. రెండవసారికూడా వీరి ప్రయత్నము విఫలమయినది. ఆదృష్టంవల్ల యీసారి కాంగ్రెసువారు జయప్రదంగా బయటపడగలిగారు. వారికి వివేకము మరింత అధికమయినది. నిన్న భారత కాంగ్రెసుసంఘ సభలో కార్యసంఘంవారి చేత రుపపాదించబడి ఆమోదించబడిన ఆ తీర్మానంయొక్కముఖ్యాభిప్రాయము "మీరు మళ్లీ కాంగ్రెసుకు నాయకత్వమును వహించి కాంగ్రెసును నడిపించవలెన"ని గాంధి మహాత్ముని కోరడమే.

గాంధిజీ పంపిన తీర్మానానికి దీనికి సారాంశములో యేమీ తేడా లేదు

గాంధిజీ కార్యసంఘంవారికి మీరాబెను గారిద్వారా పంపిన చిత్తు తీర్మానములో మహాత్ముడు వ్రాసిన వాక్యములనేసరిగా యీతీర్మానములో కార్యసంఘమువారు రుపయోగపరచలేదు కాని దానిలోని ప్రధానాంశాలన్నీకూడా దీనిలోవున్నాయి. భావములోను, ధోరణిలోను కోరికలలోను ఒకాశా దృక్పథంలోను, దానిని చేరుటలోను కూడా చాలా ముఖ్యమైన భేదాలు వున్నాయి గాని సారాంశములో మాత్రము కార్యసంఘం వారు రాగలిగిన ఫలితమునకున్నూ, గాంధిమహాత్ముని చిత్తుతీర్మానములోని ఫలితమునకున్నూ లేశమైనా భేదములేదు.

ఈ తీర్మానమును గాంధిజీ ఆమోదించిన యడల గాంధిజీ మళ్లీ కాంగ్రెసుకు నాయకత్వమును వహించి నడిపిస్తాడన్న మాటే.

యుద్ధసమయంలో అహింసాత్మకమైన సహాయ నిరాకరణము

"ఇటుపైని కాంగ్రెసు వారవలంబించబోయే అహింసాత్మకమైన సహాయ నిరాకరణము యే విధంగా వుంటుంది?" అని నేను పట్టాభిగారి నడిగాను వారిలాగు చెప్పారు.

"శాంతిసమయములో అహింసాత్మకమగు సహాయ నిరాకరణమును జరిపే పద్ధతి మన దేశీయుల కందరికి బాగా తెలిసేవుంది. యుద్ధసమయంలో యిది యేరీతిగా వుండవలెనో మనకు తెలియదు. 'శాంతి సమయంలో కూడా సార్వజనికమైన అహింసాత్మక సహాయ నిరాకరణము యేలాగువుండెనో నాకుకూడా తెలియదు' అని గాంధి మహాత్ముడే చెప్పాడు. దానిని సాధనలో మహాత్ముడు వక్కొక్క మజిలీనే దాటి పైకి వెళుతున్నాడు. పరిస్థితులను బట్టి వివరాలు మార్చిస్తూవుంటాయి. అన్నికాలంలోను అన్నిపరిస్థితులలోను అందరు కూడా అనుసరించడానికి వీలైన సహాయనిరాకరణ విధానమును సిద్ధపరచడానికి వీల్లేదు. ఒకనికి సత్యాగ్రహవిషయంలో నిజమైన ఆవేశం కలిగినయడల అతనికి సరియైనపద్ధతి స్ఫురిస్తుందనడానికేమీ సందేహంలేదు.

గాంధిజీ చిత్తు తీర్మానమును యేడుగురుమాత్రమే ఆమోదించుట

కార్యసంఘంలో యీతీర్మానం యేకగ్రీవంగానే ఆమోదించబడినుగాని గాంధిజీ మీరాబెనుగారిచేత పంపిన చిత్తుతీర్మానమును కార్యసంఘసభ్యులలో యేడుగురు మాత్రమే ఆమోదించారు. అని తెలిసిందా॥ పట్టాభిగారు నేడే యిక్కడినుంచి బయలుదేరుతారు. 4 వ తేదిని బందరు చేరుతారు.

జపాను సేనలు మాండలేను ఆక్రమించినవి?

టోకియో రేడియోవార్త ధ్రువపడలేదు

లాషియోనష్టం తర్వాత మాండలే రక్షణ అనవసరము

బ్రిటిషు సేనలు ఇండియా సరిహద్దుకు ఉపసంహరించుచున్నవి.

లండను, మే 2:—

శుక్రవారం సాయంత్రం జపానుసేనలు మాండలేను ఆక్రమించినవని టోకియో రేడియో తెలిపినది. ఈ వార్తను జపానురేడియో ఇవాళ (శనివారం) ఉదయం తెలిపినది. ఈ మాట బ్రిటిషుస్థలములనుండి, చైనీయస్థలములనుండి ఇంతవరకు ధ్రువపడలేదు. కాని, కడపసవార్తలబట్టి మాండలేలో మిత్రమండలి స్థితి గొప్పప్రమాదంలోనుండెనని తెలిసినది.

మాండలేను ఆక్రమించినట్లు జపానువారు తెలిపిన మాట లండనులో ఇంకా ధ్రువపరచకపోయినను, లాషియో శత్రుహస్తగతమైన తర్వాత. మాండలేను రక్షించుటకుగాను గొప్పనష్టములను పొందుట అవసరము, అని లండను అధికారబృందములు నేడు చెప్పిరి. మాండలే నగరము పూర్వం బర్మారాజధానిగా నుండినది.

లాషియోనుండి జపానువారి ఉత్తరగమనము

లాషియోకు ఉత్తరమున 25 మైళ్లలోనున్న హెనెన్వీకోట వరకు బర్మా రస్తాలో నెట్టుకొని వెళ్లిన జపానుసేన చిన్నదిగా నున్నట్లు తెలియుచున్నది. అంత దూరము ముందుకు సాగుటవల్ల జపానువారి రాకపోక మార్గములు ఛేదింపబడవచ్చును. కాని ఆ ప్రాంతమున దాడి జరిపి, జపానువారి రహదార్లను ఛేదించుటకు తగినంత, సంఖ్యాబలముగాని స్థితిబలముగాని చైనావారి కున్నదో లేదో లండనులో తెలియదు కాబట్టి, జపానువారికి ఈ ప్రమాదం ఎంతవఱకో చెప్ప వీలులేదు.

లండనకు వచ్చిన భోగట్టా బట్టి చైనీయులు ఇంకా టాంగ్గీని నిలబెట్టుకొనియున్నారు. వారి బలం అక్కడ ఎక్కువగా నుంటే, జపానువారిని ఒంటరి చేయవీలుకలుగును. జపానువారు ఉత్తరముగా నెట్టుకొనిపోవుటవల్ల వారికి సరఫరా మార్గములు ప్రాణతుల్యమైనవి మరింత కష్టమైనవి. ఆ ప్రాంత నివాసులనుండి జపానుసైనికులు ఆహారపదార్థములను తీసుకొని బ్రదుకగలిగినను వారి యంత్రబలములకు పెట్రోలు దినవసుండి తెప్పించవలసి యుండును గాబట్టి రాకపోక మార్గములకు అంతరాయములేకుండ యుంచుట ముఖ్యము.

యేనాన్ చుంగు తైలభూముల నాశనము

మేమియో, మే 2:—

రస్యాలో అవలంబించినంత తీవ్రంగా బర్మాలో బ్రిటిషువారు దగ్ధక్షేత్ర విధానమును అవలంబించుటవల్ల మధ్యబర్మా పడమటి భాగమునున్న యేనాన్ చుంగు తైలభూములు పూర్తిగా నాశనమైనవి అని అసోసియేటెడు ప్రెస్సు ప్రత్యేక విలేఖరి వ్రాయుచున్నాడు. యేనాన్ చుంగు అనే మాటకు వాసననీటికాలవ యని అర్థము. అది సందలాది సంవత్సరములనుండి బర్మాఅంతటా మూసెనిలయమని ప్రఖ్యాతిపొందియున్నది కాని గత 50 సంవత్సరములలోనే దానిని ఆ ప్రాంతమున ఇతర చిన్నతైలభూములను నూతనపద్ధతులప్రకారము సాధించి, తైల ఉత్పత్తి జరుగుచున్నది. బ్రిటిషు సామ్రాజ్యంలో ఒక్క ట్రినిడాడు తప్పితే, బర్మా తైలభూములవలె ఎక్కువ ఉత్పత్తిగలవి లేవు. ఇవి సాలుకు 10 లక్షల టన్నుల తైలమును ఇచ్చుచుండెను. ఈ తైలభూముల నష్టము మంచిదెబ్బయే. కాని రంగూన్ నగరము నష్టమైన తర్వాత ఈ తైలభూముల ప్రయోజనము చాలావరకు తగ్గిపోయినది. అంతేగాక, ఇతరత్ర మిత్రమండలివారికి ఉండే అపార సంపత్తికి పోల్చిచూస్తే, ఈ బర్మాతైల ఉత్పత్తి చాలా స్వల్పమే.

అనేక సెలలనుండి నిపుణులు ఈ తైలభూముల నాశన మొనర్చుటకు ఏర్పాట్లను పూర్తిచేయుచుండిరి. నాశన కార్యముఘట్టఘట్టములుగా జరిగినది. కొంద రనుకొనియుండునట్లు ఒకేసారి అద్భుతంగా జరగలేదు. కాని పెట్రోలు నిలవచేసిన టాంకులను తగులబెట్టి నప్పుడు మంటపొగ ఆకాశాని కెగసి, చుట్టూఅనేక మైళ్లవరకు కనిపించెను. బావులు, యంత్రములను తంత్రపద్ధతిగా నిరుపయోగంచేసారు. జపానువారూ వాటిని ఉపయోగించలేరు. నిపుణులెవ్వరూ మాత్రమే పనిచేయగల బ్రహ్మాండమైన కాలియ సాధనములను యంత్రములను తెస్తేనేగాని తప్ప ఐరావతీ తైలభూములలో మరల ఉత్పత్తిని పెంపొందింప వీలగును. జపానువారు యంత్రములనుగాని నిపుణులను గాని తెప్పించగలుగుటలో సందేహము.

అనలిస్టు వ్యాఖ్య

లండను, మే 1:—

బర్మానుండి వచ్చినవార్తలు ఇంకా ఉపద్రవంగానే యున్నవి. మాండలేలోను, చుట్టుప్రక్కలనున్న బ్రిటిషు చైనీయ సేనలను రెండు మంటలమధ్య చిక్కించుటకుగాను జపానువారు ఇప్పుడు లాషియోనుండి దక్షిణముగా నడుచుచున్నారట. బ్రిటిషుసేనలు ఇండియా సరిహద్దువైపుగా వెనకకుమరలుచున్నవని ధ్రువపడని వార్తవచ్చినది. ధ్రువపడకపోయినను అది అసంభవమని అనడానికి లేదు ఆ వైపున మిత్రమండలిసేనలకు తగిన రస్తా వుండదు. కాని ఆ కష్టము శత్రువుకు కూడా సమానంగా వుండగలదు. ఇంకా దక్షిణమునున్న ప్రజలకంటె ఎక్కువగా ఆ ప్రాంతప్రజలు బ్రిటిషువారిపట్ల అనుకూల భావం చూపవచ్చును. కాని మాండలే దక్షిణమున 70 మైళ్ళలోనున్న మెక్టీలా ప్రాంతమునుండి వుపసంహరించినట్లు తప్ప తెలెజ్గాండుసేనాని ప్రధాన స్థానమునుండి నమ్మకమైన వార్తలేమీరాలేదు. అని అనలిస్టు వ్యాఖ్య చేసినాడు.

చైనాకు సరఫరా సమస్య

వాషింగ్టను, మే 2:—

లాషియో నష్టమైనందున బర్మా రస్తాకు సాధ్యమైన అన్ని ప్రత్యామ్నాయములు విచారింపబడుచున్నవని రాయిటరు ప్రత్యేక ప్రతినిధి తెలుపుచున్నాడు. పెద్ద యెత్తున విమానముల ద్వారా రవాణా చేయుటయే చైనాకు సహాయం పంపుటకు త్వరితమైన పద్ధతియని అనేకమంది ఇక్కడి నిపుణులు భావించుచున్నారు. విమానస్థావరము గా సైబీరియా వాడుకొనవీలైతే, మెట్ట విమానములు అక్కడినుండి చాంగింగుకు ఎగరగలవు. సీయాటిల్ నుండి అలాస్కాకు, అక్కడినుండి మధ్య సైబీరియాలో కామచాట్కాకు, మంగోలియా మీదుగా మరొక విమాన మార్గము ఏర్పరచ వచ్చును. టిబెటు పర్వతముల మీదుగా విమానములు ఎగురుట కష్టమైనను, ఇరాను, ఇరాకులో బాస్రానంటి మిత్రమండలి స్థావరములనుండి సరఫరాలను విమానములలో పంపవచ్చును. ఆఫ్రికా ఎనువా, ఎర్ర సముద్రంమీది స్థావరములకు భద్రంగాచెళ్లవచ్చును. కాని అది చాలా దూరమార్గము. కాని అక్కడినుండి బొంబాయికి 2 వేల మైళ్లు, చుంకింగుకు 2300 మైళ్లు మాత్రమే ప్రయాణం చేయవలసియుండును.

(2 వ పేజీ చూడుడు)

రాజగోపాలాచారి తీర్మాన నిరాకరణము

పండిత జవహర్లాలు తీవ్ర ఖండన

పోషలిస్టు ఆక్షేపణ

(1 వ పేజి తరువాయి)

యాలోవున్న ముస్లిము లందరూకూడా తామొక ప్రత్యేకజాతికి చేరినవారమె అని నిష్కర్షగా తెలిపేయడల వారిఅభిప్రాయమును మార్చుకోవలసిందని ప్రపంచంలో యెవరూకూడా వారిని నిర్బంధించజాలరు" అనేవాక్యం మహాత్మునివ్యాసములోవుంది.

పాకిస్తాను శరీరములేని పిశాచమే

పాకిస్తాను శరీరములేని పిశాచమువంటిదే గాని బ్రతికివున్న మనుష్యునివంటిదికాదు. అది మిమ్ములను చంపలేదు. పంజాబులో ముస్లిములు జనసంఖ్య మిక్కిలి హెచ్చుగానే వుంది. అయినప్పటికీ ఆ రాష్ట్రంలో హిందువులు సిక్కులు మొదలైన యితర మతాలవారందరు సుఖంగా జీవిస్తూనే వున్నారు. పంజాబు మిత్రులారా! పాకిస్తాను నిర్జీవమైనపిశాచమని మీరు బాగా తెలుసుకోండి. నేను దీని నెదుర్కొని దీనిగడ్డంపట్టుకొనిక్రీడించేస్తాను. (నవ్వు)

రాజగోపాలాచారిగారి వుపన్యాసము ముగియగానే సభ్యులందరు మనఃపూర్వకంగా హర్షధ్వనులను చేశారు.

కె. సంతానంగారి తీర్మానము

ననువదించుట

ఈ తీర్మానమును ఆమోదిస్తూ కె. సంతానంగారు సభలో మిక్కిలి ఘాటుగా మాట్లాడారు. వారిలాగు చెప్పారు. "ప్రస్తుతము దేశమున కటువంటి అసహాయస్థితికలగుటకు కాంగ్రెసువారు బాధ్యులుకారు" అని కొందరన్నారు. నైతికమయిన బాధ్యతను యితరులకుకూడా పంచిపెట్టినంత మాత్రము వల్ల లాభములేదు. దేశంలో ప్రజలకు కష్టములతోకూడిన పరిస్థితులు యెవరివల్ల కలిగినాకూడా వాటినుంచి ప్రజలను కాపాడుట కాంగ్రెసువారికి ముఖ్యకర్తవ్యమే. మేము బాధ్యులము అన్ని చెప్పడము తప్ప మరేపని కాంగ్రెసువారు చేయలేకపోయినట్టయితే కాంగ్రెసు వుండడమెందుకు? ముస్లిములకు స్వయంనిర్ణయాధికార మున్నదని కాంగ్రెసువారంగీకరించినయడల ముస్లిములే ఆలోచించి నిర్ణయిస్తారు.

వారన్నిసంగతులను సరిగా తెలుసుకోగలుగుతారు. ఈ తీర్మానాలు మదరాసులో ఆమోదించబడిన పిమ్మట మదరాసులోని ముస్లిములు ఆలోచించడమునకు ప్రారంభించారు. "పంజాబులోను బెంగాలులోను పాకిస్తానువల్ల ముస్లిములకు లాభము కలుగుతుందేమోగాని మదరాసులోను బొంబాయిలోను పాకిస్తానువల్ల ముస్లిము సమస్యలేకూడా పరిష్కారము కావు." అని వారిప్పుడు చెబుతున్నారు. ఆ పాకిస్తానును మనము వారికిచ్చినయడల అది చావుల సముద్రములోని పండని వారు తెలుసుకోగలుగుతారు. దానిని వారికిచ్చుటకు యిపుడు కాంగ్రెసువారంగీకరించకపోతే వారు పాకిస్తానుయొక్క నిజస్వరూపమును తెలుసుకోజాలరు. అందువల్ల హిందువులకు ముస్లిములకు అయిక్యమత్యము కలగదు.

జగతునారాయణ లాలుగారు

రాజగోపాలాచారిగారి తీర్మానమునకు కేవలము విరుద్ధముగావున్న మరివక తీర్మానము నటుతరువాత జగతునారాయణలాలుగారు సభలో వుపపాదిస్తూ యీలాగు చెప్పారు.

"రాజగోపాలాచారిగారి తీర్మానము యీ సభలో ఆమోదించబడకపోయినయెడల నేనీ తీర్మానమును వుపపాదించవలసిన అవసరమే లేదు అని కొందరన్నారు. ఇండియాను విభజించకూడదని స్పష్టంగా తెలిపే ఒక తీర్మానము యీ సభలో ఆమోదించబడడము చాలా అవసరము. రాజగోపాలాచారిగారి కథికమైన దేశక్తి వున్నది. వారు చాలా యుక్తిపరులు. వారిటువంటితీర్మానమును వుపపాదించుటవల్ల యీ తీర్మానం మిక్కిలి ప్రమాదకరమయినది. క్రిప్సుగారి రాయబారాలు విఫలమైనపిమ్మటకూడా ఇండియాలో జాతీయప్రభుత్వము యేర్పడుతుందన్ని దుర్భ్రమ రాజగోపాలాచారిగారివంటి ఆగితేరిన రాజకీయనాయకునకుకూడా కలగడం నాకు చాలా ఆశ్చర్యకరముగానే వుంది. ఇండియాను విడదీయడానికి పంజాబులో హిందువులు సిక్కులు యెంతమాత్రము అంగీకరించరు. సరికదా దీనివల్ల దేశములో యాన్మంది హిందువులకూ, ముస్లిములకూ కూడా చాలనష్టం కలుగుతుంది. ఇండియాను విడదీయవలెననని రెండేళ్లక్రితము ఏ రాజకీయ నాయకుడైనా సూచించినయెడల అన్ని దేశాలవారూ కూడా ఆ నాయకుని పరిహసించి వుంగురు ఇండియాలో ముస్లిములలో జాతీయవాదులు కూడా దీని నామోదించరు. అమెరికా క్రిప్సుగార్ల సలహా ప్రకారము ఇండియాలో సాంఘిక వివాదాలు యింకా చాలా అధికమయేలాగు చేస్తూవున్నవారు మాత్రమే దీని నామోదిస్తారు. ఇండియాను విడదీయగూడదని యీసభకు వచ్చిన సభ్యులందరూకూడా తమ అభిప్రాయమును నిర్ధారణగా తెలుపవలెను. అంతకు యీతీర్మానానికి అనుకూలముగా వోటు చెయ్యవలెను."

టంగుటూరి ప్రకాశం పంతులుగారు

దీనిని బలపరుచుట

టంగుటూరి ప్రకాశం పంతులుగారు జగతు నారాయణలాలుగారి తీర్మానమును బలపరుస్తూ యీలాగు చెప్పారు.

"ఈ పాకిస్తాను తీర్మానము మిక్కిలి గుస్సహమైనది. ఈ దుష్టప్రచారమును పూర్తిగా నిలిపివేయవలెను. ఇండియాలో హిందు ముస్లిము క్రయిస్తవమతాలు ఏలాగు యెర్పడ్డాయో మనకందరికి బాగా తెలిసే వుంది. మనము శ్రద్ధగా పనిచేసిన యడల త్వరలోనే అన్నిమతాలవారికి సమాధానం కుదురుతుంది. పాకిస్తాను స్కీము పూర్తిగా తొలగిపోతుంది అని నేను నిర్ధారణగా చెప్పగలను. రాజగోపాలాచారిగారి తీర్మానాలను ఆమోదించినవారిసంఖ్య మదరాసు ప్రెసిడెన్సీలో మిక్కిలి తక్కువగానే వుంది. ఈ తీర్మానాలు ఆమోదించబడిన సభను గురించి శాసనసభ్యులలో మిక్కిలి హెచ్చుమందికి తెలియనే తెలియదు. ఈ తీర్మానాలనుగురించి సభ్యులకు ముందుగా తెలియజేయలేదు. వీటిప్రతులను సభ్యులకిచ్చియుండలేదు. ఈ తీర్మానాలను సభలో వుపపాదించేవరకు వీటినిగురించి సభకువచ్చిన వారికికూడా తెలియదు. మదరాసులో కొన్నిపత్రికలు ముందుగానే సంపాదకీయములను వ్రాశాయి.

డాక్టరు రాజేంద్ర ప్రసాదుగారు

రాజగోపాలాచారిగారి తీర్మానమును ఆక్షేపిస్తూ రాజేంద్రప్రసాదుగారిలాగు చెప్పారు.

"క్షీరసముద్ర మథనమును జరుపుటకు దేవుడు మన మిక్కడ చేరలేదు. యేపకుంవారు దేవతలో యేపకుంవారు దానవులో కూడా మనకు తెలియదు. దీనిని మథించినందువల్ల విషమే పుడుతుందో అమృతమే పుడుతుందో కూడా మనకు తెలియదు. ఇప్పటికరకు మనకు విషమూమాత్రమే లభిస్తూవుంది. మన మెంతకాలమువరకు యీలాగు విషపానమును చేస్తూవుండగలము? ఆలాగు వుండడానికి తగినంతశక్తి మనకువున్నదా? ఇటువంటి పురాణగాథలను యీ సభలో రాజగోపాలాచారిగారు లేకరువు పెట్టడంవల్ల యేవిధమైన లాభమూ కలగదు.

ముస్లిములీగువారిని సంతృప్తి పరచడము రాజగోపాలాచారిగారిముఖ్యోద్దేశము కాదు మదరాసు ప్రెసిడెన్సీలో మళ్లీ రాష్ట్రీయ స్వపరిపాలనము నేర్పరచడమే వారి ముఖ్యోద్దేశము. రెండేళ్ల క్రితము కూడా వీరు యీ వుద్దేశముతోనే వెల్లడించారు ఇండియాలో జాతీయప్రభుత్వము యేర్పరచబడు నని క్రిప్సుగారు లేనిపోని ఆశలను కలిగించిన తరువాతనే ముస్లింలీగువారిని సంతృప్తిపరచవలెనన్న అభిప్రాయం రాజగోపాలాచారిగారికి కలిగింది. జాతీయప్రభుత్వం ఎడమూవివంటిది. అది లేనేలేదు. దీనిని ఇండియాలో యేర్పరుస్తామని క్రిప్సుగారు వాగ్దానము చెయ్యలేదు. మరుమరీచిక వెంట పరుగిడితే నీళ్లు దొరకవు. దాహము తీరదు.

ముస్లింలీగు వారు తమ కోరికలను నిర్ధారణగా తెలిపివుండలేదు. అది వక ఆకాశపంచాంగం రీతిగావుంది. దానిని నిర్ధారణగా తెలుపవలెనని నేను జిన్నాగారికి వ్రాశాను. జిన్నాగారు నాకొకదీర్ఘమైనలేఖనువ్రాశారుగాని దానిలోకూడా తమకోరికలను స్పష్టముగా తెలిపివుండలేదు. అతి ప్రాచీనకాలం నుంచిన్నీ హిందూస్తానము అఖండముగానే వుంది. ఇటుపైనికూడా అది అఖండముగానే వుండవలెను. మూడవ పార్టీవారు మన దేశంలో వుండే హిందువులకూ ముస్లిములకూ సమాధానము కుదరకుండా చేస్తున్నారు. మనము పాకిస్తాను కంగీకరించినంతమాత్రమున సాంఘిక సమస్య పరిష్కారము కాదు. దీనివల్ల ముస్లిములకు గాని హిందువులకు గాని విభజించబడిన భాగమువారికి శేషించిన భాగమువారికి గాని యేవిధమైన లాభమూ కలగదు. ఏడుస్తూవున్న బిడ్డను వూరుకోబెట్టడానికి మనము దానికొకబొమ్మ నిస్తాము. పాకిస్తాను అటువంటి బొమ్మకాదు. ఇదిచావు బతుకులతోకూడిన ముఖ్యతమమైన విషయము జిన్నాగారికి కూడా తెలిసే వుంది

పండిత జవహర్లాలు నెహ్రూగారు

నెహ్రూగారు రాజగోపాలాచారిగారి తీర్మానమును నిరసిస్తూ చాలా వుద్రేకముతో మాట్లాడారు. నెహ్రూగారు జగతునారాయణలాలుగారి తీర్మానమును బలపరిచారు. నెహ్రూగారిలాగు చెప్పారు. "రాజగోపాలాచారిగారి తీర్మానమును అనేక కారణాలవల్ల నేను తిరస్కరిస్తున్నాను. దీనివల్ల హిందువులకు ముస్లిములకు సమాధానము కలుగదనేదే ముఖ్యమైన కారణము. మదరాసు ప్రెసిడెన్సీలో స్వపరిపాలనము యేర్పడడమే రాజగోపాలాచారిగారి ముఖ్యోద్దేశము. ఈవుద్దేశమును నేను పూర్తిగా నిరసిస్తున్నాను. లాలుగారి తీర్మానం కార్యసంఘంవారి తీర్మానమునకు ప్రతికూలము కాదు. కార్యసంఘంవారి తీర్మానములోని విషయముల నెంతమాత్రమూ మార్చగూడదు. ఇండియాలో పుట్టి పెరిగినవారెవరూ కూడా పాకిస్తాను స్కీము నామోదించజాలరు. వివేకమును కార్యకారణసంబంధ పరిజ్ఞానమును కలవారెవ్వరూ కూడా పాకిస్తాను స్కీమును ఆమోదించరు. భారతస్వపరిపాలనమునకు కేవలము ప్రతికూలముగా వున్నయడల యిటువంటి వారు దీనినామోదిస్తారు. ముస్లిములకోరికలకు అంగీకరించేవరకు యిండియాలో జాతీయ ప్రభుత్వం వుండగూడదు. దానికి సంపూర్ణాధికారము వుండగూడదు, అని ముస్లిములీగు ప్రధాననాయకులలో వకరు క్రిప్సుగారితో చెప్పారు. దీనికి నేనెంతమాత్రమూ అంగీకరించజాలను. ఇటువంటి కోరికలను కోరేవారితో సమాదానపడుటకు నేనెంతమాత్రము అంగీకరించను. పాకిస్థానమను ప్రతిఘటించుటలో నాకు సహాయం చెయ్యవలెనని నేను బ్రిటన దొరతనమువారిని కోరిన యడల నేను జీవించి వున్నంతకాలము ప్రజలందరూ కూడా నన్ను నిందిస్తూనే వుంటారు. ఇండియాలో ముస్లిములలో మిక్కిలి హెచ్చుమంది తమ కందరికీ ముస్లిములీగు ఒక్కటే ప్రతినిధి సంఘమని అంగీకరించడము లేదు. ఇండియాలో ముస్లిములలో కొంతమందికి ముస్లిము లీగు ప్రతినిధిసంఘమే అని నేనంగీకరిస్తాను అవిభాగ వారితో రాజీపడడానికి నేను చాలాసారులు ప్రయత్నించాను. వారు అంగీకరించలేదు. ఇండియాకు సంపూర్ణ స్వాతంత్ర్యము కలగవలెను.

రాజగోపాలాచారిగారి

ప్రత్యుత్తరము

తన తీర్మానముపై జరిగిన చర్చకుప్రత్యుత్తర మొసంగుచు శ్రీ రాజగోపాలాచారిగారిట్లు చెప్పిరి:—

ఒకానొక స్థితి యేర్పడినందుకు బాధ్యుడొక వ్యక్తియని సూచించుట నిరర్థకము ఆ స్థితిగతుల నెదుర్కొని పరిష్కరించుటయే ఉద్దేశ్యమైనచో, భారతదేశముయొక్క ప్రస్తుతస్థితికి బాధ్యులు బ్రిటిషు ప్రజలని చెప్పుటవలన ప్రయోజనము లేదు. వారు చేసినదానిని చక్కజేయుటకు మనము గడింపవలసియున్నది. ఇది సరియైన సమయము. ఇప్పుడు మనకు మంచి అవకాశము కలిగినది ఇంకా నూరు సంవత్సరములవరకు మనకిట్టి అవకాశము లభింపదు. మంచి ప్రభుత్వము తనచేతులలో నున్నంతవరకు శివాజీ వేచి యుండెనా? మనకు చేజిక్కిన ప్రభుత్వము మనము పుచ్చుకొని దానిని లోపరహితముగా చేసి, అది మనకు ప్రయోజనకరమగునట్లు చేసుకొనవలెను బ్రిటిషువారిదితప్పనియు, మీదిబప్పనియు మీరు బుజువుచేసితిరికాని అందువలన నేమి ప్రయోజనము. ముస్లిమ్‌లీగుస్వాతంత్ర్యకార్యక్రమమునకు అడ్డముగా నిలిచెనని పండిత నెహ్రూగారు ప్రకటించియుండిరి. ఇదియే నిజమగుచో అసమస్యను మీరు పరిష్కరింపవలదా? ముస్లిమ్ లీగువైఖరి సవ్యమైనది కాదనియనుటవల్ల ప్రయోజనమేమి?

జగత్ నారాయణగారి తీర్మానము

నిరాకరింపుడు

శ్రీజగత్ నారాయణలాల్‌గారి తీర్మానమును మీరు అంగీకరింపవలదు. సభవారు నాతీర్మానమును నిరాకరించిన నిరాకరింపవచ్చును. కాని జగత్ నారాయణుని తీర్మానమునుమాత్రము సభవారంగీకరింప కుండురు గాక! అంగీకరించిలేని కాంగ్రెసు ఎల్లప్పుడు ముస్లిమ్‌లీగుకు విరుద్ధముగా నుండునట్లుచేసిన వారగుదురు.

ఆచారిగారి తీర్మానము వీగిపోయెను

శ్రీ రాజగోపాలాచారిగారి తీర్మానమును సభవారు 120-15 వోట్లచే నిరాకరించిరి.

శ్రీ జగత్ నారాయణలాలుగారి తీర్మానమును సభవారు 92-17 వోట్లచే నామోదించిరి.

రెండోతీర్మానమును ఆచారిగారు

ప్రతిపాదింపలేదు

తన రెండవతీర్మానము మద్రాసు రాజధానికి చాలా ముఖ్యమైనప్పటికి దానిని తాను ప్రతిపాదింపదలపలేదని ఆచారిగారు ప్రకటించిరి. "వ్యవధిలేకపోవుటచేత నేను దానిని ప్రతిపాదించుటలేదు. నేను దానిని మానుకొనలేదు. మద్రాసు వేరైపోవచ్చునని నేను సభవారికి హెచ్చరిక గావించుచున్నాను. ఐకమత్యమును గూర్చి ఎన్నిమాటలుమాట్లాడినను తరువాత ప్రయోజనములేదు." అని ఆచారిగారనిరి.

ఆచారిగారి వైఖరి తప్పు

మౌలానా అజదు అంత్యోపన్యాసం

సభను సమాప్తము గావించుచు మౌలానా అజదుగారు ఈ క్రింది విధముగా చెప్పిరి:—

రాజగోపాలాచారిగారు తన అభిప్రాయమును మన యెదుట నుంచెను. కాంగ్రెసుకును లీగుకును గల విభేదములు, దేశమునకు నష్టదాయకములనియు, ఈ విభేదములను తొలగింపవలెననియు ఆచారిగారు నమ్ముచున్నారు. ఇందు విషయమై సభవారిలో అభిప్రాయభేదము లేదని చెప్పగలను. మన ఉద్దేశ్యముకూడ నదియే. కాని ఈ ప్రయోజనమును సాధించుటకు ఆచారిగారిట్టి పద్ధతి నవలంబించుట నాకువిస్మయము కలిగించుచున్నది. ఆచారిగారు అవలంబించినపద్ధతి, రీతి ఈ ఉద్యమమునకు అపరిమితమైన హాని కలిగించును. ఇందుకు ఆచారిగారే సంపూర్ణముగా బాధ్యులై యుండుదురు

లీగుతో సఖ్యతకై ప్రయత్నములు

కాంగ్రెస్‌వారి రహస్యములన్నియు తెలిసిన ఆచారిగారు, ఈ విభేదములను తొలగించుటకు జరిగిన ప్రయత్నముల నన్నింటిని బాగుగా నెరింగిన రాజాజీగారిట్టి పద్ధతి నవలంబించుట ఆశ్చర్యకరము. విభేదములను తొలగించుటకు నేను సర్వశక్తుల ప్రయత్నించితిని. 5 సంవత్సరములనుండియు నేను ప్రయత్నములు గావించితిని. ఇందుకు సంబంధించిన విషయములు కొన్ని మీకు తెలిసినవి. కాని నే నెవ్వరికిని చెప్పనివిషయములు కొన్నికలవు. రాజీయేదైన కుదురుచో చెప్పుట మంచిదని నేను వాని నెవ్వరితోను చెప్పలేదు. నేను చేయకుండ వదలిన ప్రయత్నమే లేదు. ముస్లిమ్‌లీగును సడుపువారు కాంగ్రెసుకు అడ్డుగా అభేద్యమగు నొక గోడ నిర్మించిరి. నేను జిన్నాగారిని కలిసికొని రెండుసారులు మాట్లాడితిని. పండిత నెహ్రూగారి రాయనతో ఉత్తరప్రత్యుత్తరములు జరిపిరి. గాంధిమహాత్ముడుగూడ జిన్నాగారితో మాట్లాడెను. తనకు చేతనైన దంతయు ఆయన చేసెను. మా పట్టుదల కొన్ని సమయములయందు ప్రజలకు అయిష్టముగా గూడ నుండెను. మన మెంత మాత్రము అంగీకరింపజాలని రెండుమరతులను లీగువారు దెలిపిరి. ఈ సమస్య హిందూ మహమ్మదీయ సమస్య కాదనియు, లీగు - కాంగ్రెసు సమస్య యేర్పడిన విభేదమనియు వారనిరి. ఈ 5వ సంవత్సరముల నుండియు కాంగ్రెసు చేసిన పని కంతటికి తిలోదకము లిచ్చుకొని, తమ సంస్థ హిందూ సంస్థయని కాంగ్రెసువారు అంగీకరింపవలసినవారైరి మరియు ముస్లిమ్ లీగు మహమ్మదీయుల ఏకైక ప్రతినిధియనిగూడ మనము అంగీకరింపవలసినవారమైతిమి. ఈ మరతలను మన మంగీకరింప కీలులేక పోయెను సంఖ్యామణులవలన ప్రయోజన మేమియు లేకపోయెను. నేడు కాంగ్రెసులో చాలమంది మహమ్మదీయులు సభ్యులుగా నున్నారు కాని మన మాలోచించవలసిన దిదిగాదు. కాంగ్రెసులో ఒక్క మహమ్మదీయుడు, సిక్కు, క్రైస్తవుడైనను లేకపోయినను, కాంగ్రెసు జాతీయ దృష్టితో ప్రవర్తించి యావద్భారత దేశ క్షేమమును కనిపెట్టియున్నంకాలము నయ్యది దేశప్రజలందరి యభిప్రాయము ప్రకటించు సంస్థయనుగాని మతసంస్థ లేక ఒకకొందరి యభిప్రాయమును మాత్రమే ప్రకటించు సంస్థకాజాలదు. ఇట్టి వైఖరి నవలంబించుటవలన ఉపద్రమణికలన. దాటి నిజమసమస్యా పరిష్కారమునకు గడంగ వీలులేక పోయెను.

సర్. సికందర్ ద్వారా

గావించిన సూచన

ముస్లిమ్‌లీగువారు 5 గురు ప్రతినిధులను నియోగింపవలెననియు, వీరును కాంగ్రెస్ ప్రతినిధులును ఒక్కచోటజేరి స్థితిగతుల నన్నిటిని విచారింపవలెననియు కరాచీ ముస్లిమ్‌లీగు మహాసభసమయమున నేను సర్ సికందర్‌హాయతు ఖానుద్వారా నొక సూచన గావించితిని. ఇది సరియైనపద్ధతిగా నుండెడిది. ఇందువలన ఫలితము కలుగకపోయినను, ప్రయత్నము గావించి వారుటకు మంచిదని నేను తలచియుండితిని. ఇందువలన నష్టమేమియు కలిగియుండెడిదిగాదు.

ఆచారిగారిపద్ధతి తప్పు

ఈసమస్య దేశమంతటికిని సంబంధించినదై యున్నది. వ్యక్తులు, వ్యక్తిగతాభిప్రాయములు అక్కరకురావు. ఈవిషయము యావద్భారతజాతికి సంబంధించినదై యున్నది. ఆచారిగారి పద్ధతి సరియైనదికాదు. ఆయన ప్రయత్నమునకే అది భంగము కలుగజేయును. ఎవరో ఒకరు ఒకకోర్కె కోరుట, మనము అంగీకరించుట అను విషయమునకే కిది సంబంధించినది కాదు. మన పక్షమున కొందరు ప్రతినిధులను, లీగు పక్షమున కొందరు ప్రతినిధులను నియోజించి, ఇరువురి మధ్య యుదయించిన విభేదములను చర్చించి, పరిష్కరించుట పరియైన మార్గము. 5 గురు ముస్లిమ్‌లీగు ప్రతినిధులను కలిసికొని, చర్చించి, ఒడంబడికకు దుర్ఘటకై 5 గురు కాంగ్రెసు ప్రతినిధులను నియమించుటకుగాను వర్కింగ్ కమిటీ సభసమావేశ పరుపక్షనిప్పటికిగూడ నేను సిద్ధముగా నున్నాను.

పాకిస్థాను ఇస్లాముకుట్టవిరుద్ధము

పాకిస్థాను ఇస్లాముకు విరుద్ధము. మహమ్మదీయులు అత్యధిక సంఖ్యాకులుగా నున్న ఒక రాష్ట్రము 'పాక్' అనియు, యితర భాగములు 'న-పాక్' అనియు చెప్ప వీలులేదు. పాకిస్థానన నేమో సరిగా చెప్పిన వారెవ్వరు లేరు. పాకిస్థానన నేమి? యని ప్రశ్నించుచో సర్ సికందర్ గారొకమాదిరిగనుజిన్నాగారు మరియొక మాదిరిగాను చెప్పుదురు. మన యెదుట నున్న తీర్మానము మరొకవిధముగా చెప్పుచున్నది. పాకిస్థాన నేమో చాల అస్పష్టముగా నున్నది. ఇట్టి సందర్భమున బాధ్యతతో ప్రవర్తింపవలసిన మన సంస్థ చేయవలసిన దేమి? రాజకీయాభివృద్ధి నరికట్టు మార్గమును యే రాజకీయపక్షము గూడ నవలంబింప రాదు. 'మా కోర్కెయిది, దీనిని మీ రంగీకరింపనిచో మీతో మాకేమియు సంబంధములేదు' అని చెప్పుట తప్పు.

రాష్ట్రములకు అభయము

రాష్ట్రములలో మహమ్మదీయులకు గల భయమునుగూర్చి ప్రస్తావించుచు, మౌలానాగారిట్లు చెప్పిరి:—

కేంద్రమున మన మేర్పరుపదలచు ప్రభుత్వము రాష్ట్రముల ఆంతరంగిక విషయములలో సాధ్యమైనంత తక్కువ జోక్యము కలిగించుకొనునని రామఘర్ కాంగ్రెసు అధ్యక్షోపన్యాసములో నేను స్పష్టముచేసియుంటిని.

కృతజ్ఞత

సభ్యుల సౌకర్యములకై ఆహ్వానసంఘమువారుచేసిన యేర్పాటులకు నేను కృతజ్ఞత తెలుపవలసియున్నది. అలంకారములు 5 రాడంబరముగా మన్నందు నను, ఎండ వేడిమి కనబడకుండ చేసినందుకును ఆహ్వాన సంఘమువారి నందరిని శ్లాఘింపవలసియున్నది. నియమ నిగ్రహములు మన సంస్థకు ప్రాణతుల్యములగుట మాత్రమే గాక, జాతీయ జీవనమందు గూడ చాల ముఖ్యమైనవగుట చేత కార్యనిర్వాహకులు, శాంతి సైనికులు ప్రదర్శించిన నియమ నిగ్రహములు నాకు అపరిమితమగు సంతృప్తి కలిగించుచున్నవి"

ఆహ్వాన సంఘ పక్షమున తత్ సంఘాధ్యక్షుడగు డా॥ కె. యస్. కట్జూగారు తగినట్లుగా ప్రత్యుత్తర మొసంగిరి.

నాయకులు వెడలిపోవుచుండుట

అలహాబాదు, మే 2:—

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు కొందరు వెళ్లిపోయిరి. కొందరు వెళ్లిపోవుచున్నారు. మౌలానా అజదుగారు నేటిరాత్రి కలకత్తా వెళ్లుచున్నారు. డా. పట్టాభి సీతారామయ్య, పండిత పంతుగారలు వెళ్లిపోయిరి. డా. రాజేంద్రప్రసాదుగారువార్ధా, సర్దార్ పటేలుగారు బొంబాయికి బయలుదేరి వెళ్లిరి. శ్రీ. సి. రాజగోపాలాచారి, అసఫాలీ దంపతులు నేటి పాయంకాలము డిల్లీ వెళ్లిరి శ్రీభూలాభాయ్ దేశాయిగారు నేటిరాత్రి లక్నో వెళ్లుచున్నారు. అచ్చటినుండి రేపు ఉదయము పంజాబుమెయిలులో బొంబాయి వెళ్తారు. శ్రీ సత్యమూర్తి, డా॥ రాజన్ గారలు నేటిసాయంకాలము ఢిల్లీ వెళ్లుదురు

మదరాసులోని

కళాశాలలు పాఠశాలలు

—(1)—

పొరుగూరులలో తెరచుటకు

ఏర్పాటులు

ప్రభుత్వ సహాయ మివ్వబడు నను సూచన

మదరాసు, మే 2 —

చెన్నపట్టణములోగల పాఠశాలల్లో అనేక పాఠశాలలును కొన్ని కళాశాలలును జూను ఆఖరువారంలో జిల్లాకేంద్రాలలో తెరిచి తెరువబడునని తెలుస్తున్నది. ఒక ప్రఖ్యాత కాలేజి అధికారులు యీరోజులలోనో లేదా కోయంబత్తూరులోనో కళాశాల తెరచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని రూఢిగా తెలుస్తున్నది. మరొక పెద్దపాఠశాల (నగరములో అనేకశాఖలు గలది) కోస్తాకు అతిదూరముగా యుద్ధప్రమాదం లేకుండే గ్రామంలో తెరువబడును.

విద్యార్థులకు వారల పెద్దలకు సౌగ్యమైనంత ఎక్కువసౌకర్యం కలుగజేయుటకు పొరుగూళ్లలో తెరువబడే యీవిద్యాసంస్థల అధికారులకు కలయ సహాయమును ప్రభుత్వము ఇచ్చునట్లు తెలిపినదని తెలుస్తున్నది.

ది జనరల్ అష్యూరెన్సు

సొసైటీ లిమిటెడ్.,

స్థాపితము 1907. అజ్మీరు.

ఆస్తులు ఒక కోటికి మించినవి

బోనస్

అత్యధికము

యావజ్జీవితం 22½% సంవత్సరము ఎండోమెంటు 18%

క్లైయిములు అతిత్వరగా పరిష్కరింపబడును

ఆకర్షణీయమగు నవీనపద్ధతులు

ఎక్స్‌టెండెడ్ ఇన్‌షూరెన్సు

అసమాన ప్రయోజనము.

వివరములకు:—

బ్రాంచి మేనేజరు, ఉత్తర చత్రల్ వీధి, మధురై.

బ్రాంచి మేనేజరు, ఆర్గనైజింగు సెక్రటరీ, హుబ్లీ, బేలూరు. 8 వ రోడ్డు, చామరాజపేట, బెంగుళూరుసిటీ.

బ్రహ్మదత్తుగారు, బి. ఎస్‌సీ, ఎల్‌ఎల్. బి, ఎఫ్. ఎస్. ఎస్. (లండన్.) జనరల్ మానేజరు, అజ్మీరు.

3 ఆర్స్ లో నొకటి. 'రేన్‌జర్' రిస్టువాచి.



స్పటికంవంటి కేసు, మాయని స్టీల్ బ్యాక్, రోలెక్సు ట్యూడర్ లీవర్ మూవ్‌మెంటు.

సాధారణ ఫుల్ స్కూ 55/- రేడియం డయల్ స్కూ 60/-

3 ఆర్స్ నమ్మకమైనవి.

Orr & Sons Ltd

MADRAS, OOTACAMUND, RANGOON.

POST BOX No 317 MADRAS

బర్మా యుద్ధము

(1 వ పేజి తరువాయి)

బ్రిటిషుసేనల

ఉపసంహరణ కారణము

న్యూఢిల్లీ, మే 1:—

మేక్టీలానుండి కొత్తరంగమునకు అలెగ్జాండరుసేనానిబలములు ఉపసంహరించినట్లు నేడు తెలుపబడినది. ఆఉపసంహరణతో కవచితపటము గట్టి రక్షణగా నుండెనుఅనగా కవచితమోటార్లు అడ్డుగానిలిచియుండినవి. ఇప్పుడు ఆసేనలు మాండెలే మట్టూ, ఆనగరమునకు తూర్పుగానున్న చైనీయసేనలతో సంబంధము కలిగియున్నవి. మరొక చిన్న చైనీయసైన్యము టాంగ్గీలాయిలెం మధ్య చురుకుగా పనిచేయుచున్నది. కాని లాషియోలోవలెనే, జపానుసేనలు లాయిలెం వెనకనుండి చొరబడి రస్తాను పట్టుకొనుటవల్ల ఈ చైనా సైన్యమునకు చుంకింగుతో సంబంధం తెగిపోయినది. పక్కనుండి శత్రుసైన్యము ఆవరించినప్పటికిను, గొప్పగా సొమ్మసిల్లి నప్పటికిను మాత్రమే బ్రిటిషు చైనీయసేనలు వెనకకుతగ్గినవని గమనించవలెను. ఇటీవలి పురోగమనమున జపానువారికి అమితనష్టం కలిగిందనిన్నీ, నూటికి 20, 25 మంది సైనికులు నష్టమైరనిన్నీ అనుకొంటున్నారు.

బర్మాలోనున్నవారికి

చెల్లించవలసిన అప్పులు

ప్రభుత్వప్రకటన

న్యూఢిల్లీ, మే 2:—

ఆక్రమిత బర్మాలోను, అండమాను, నికోబారు దీవులలోను నివసించుచున్న ఋణదాతలకు చెలించవలసిన అప్పులగురించి శత్రు ఆస్తిరక్షకోద్యోగికి తెలుపనక్కరలేదు కాని, ఋణదాతలు రాజుగారితో యుద్ధం చేయుచున్న రాజ్యంయొక్క పౌరులు గాని, ఆ పౌరులకు చెందిన, అదీనంలోనున్న సంస్థలు గాని అయితే, శత్రుఆస్తి రక్షకోద్యోగికి తెలుపవలెను. చెల్లింపవలెను, అని ప్రభుత్వంవారు ప్రకటించిరి

మదరాసు గవర్నరు

మదరాసు, మే 2 —

మదరాసు గవర్నరుగారు సోమవారం 4 వ తేదీని కోయంబత్తూరు చేరనున్నారు. అక్కడివారు అదే సాయంత్రం ఉపన్యాసములనుకు వెళ్లి అక్కడ కొన్నిరోజులు ఉంటారు. తరువాత మదరాసుకు తిరిగి వస్తారు.

(3 వ పేజీ తరువాయి)

సరణిరాక, పెళుచుమాటలదొంతి పేర్చుచు సాధారణములైన యతిప్రయోగములులేక, నొకరి కవితందు గని హేళనోక్తులాడు కుకవిశుంఠలమాతిపై గొట్టునటుల, నే నొనర్చెద పద్యముల్ నీదు కరుణ"

ఈతను గొప్పకవి యయ్యు నెందుచేతనో కావ్యరూపముగ నొకగ్రంథము నైనను వ్రాయనయ్యెను.

మరియు నీకవి జేములవాడ భీమకవివలె వళ్ళవాక్కటుటకు యీ క్రిందికథ యుదాహరణము.

ఈ కవిగారి బజ్జెగొడ్డు ప్రక్కయింటి వారి పెరటిలోని చిక్కుడుచెట్టును పూర్తిగా మేయుటచే నాయింటిమూడి యీ కవిని చాలతిట్టిన దట. ఈకవి శాంతుడై "అమ్మా మీకు కలిగిన నష్టము నిచ్చెదను. మమ్ములను తిట్టకుమని" ప్రార్థించెను. ఆమె ఈతనిమాటలను లెక్కింపక తనధోరణిని తానుతిట్టుచునేయుండెను. అందుల కీకవి కుపితుడై రాజునొద్దకుపోయి 'మీ రావిడతల గొరిగించెదరా? లేక నన్నా పనిని చేయమనెదరా?' యని అడిగెనట. అందులకు రాజుగారు తనచేత ఆపని కానిదని రట. పిమ్మట యీకవియే "వెయ్యిరిట్లు దండెకము" చెప్పెనట. అందు తిట్టినతిట్టుతిట్టక వెయ్యిరిట్లును ఆమె భర్తనుద్దేశించి తిట్టెను. దండెకము పూర్తియగునప్పటికి నా మె భర్త కూడ పూర్తియయ్యెనట. ఇప్పటికిని ఏనూరు తిట్లు మాత్రముగల వ్రాతప్రతు లచ్చటచ్చట గన్పట్టుచున్నవి.

ఈసంస్థానాధిపతులటువంటియాంధ్రకవుల పెక్కుర పోషించిరి. వీరికి నాంధ్రమున గల యావదాదరము మెండు. కవులచే పెక్కులాంధ్ర గ్రంథములు రచియింపజేసి భాషాభివృద్ధి పొందించిరి. నిత్యారు మండలమున, నప్పటికిని, య

తమాషా—ఖులాసా!

❋ భావసంచారి ❋

చైత్రం వైశాఖం ఆసేవి రెండూ, నాకు ఎందుచేతనో, అన్నదమ్ములు లాగున కన్పిస్తాయి. రాముడు లక్ష్మణుడూ అన్నట్లుగా ఉంటాయి. కృష్ణమూర్తి, బలరామమూర్తి అన్నట్లుగా సూర్యభగవానుని జ్యేష్ఠకుమారుడు చైత్రమూర్తియున్నూ, రెండవకుమారుడు వైశాఖమూర్తియున్నూ నూనూగు మీసాల నూత్నయౌవనవసంతంలో ఉన్నట్లుగా కన్పిస్తారు. భానుమూర్తిగారి పెద్దకుమార్లే, యీ చైత్రమూర్తియున్నూ వైశాఖమూర్తియున్నూ అని నానమ్మకం—నాకు శ్రావణ భాద్రపదాలు మాత్రం అక్కచెల్లెళ్లులాగున కన్పిస్తారు. శ్రావణమ్మ, భాద్రపదమ్మ, మంగళప్రదంగా నోములు నోచుకుంటూ రంగుల రంగుల పట్టుచీరలు కట్టుకొని సెనగల వాయినాలకు పిల్లలను వెంటబెట్టుకొని తిరుగుచున్నట్లుగా, నా భావప్రపంచంలో ఆ రెండుమాసాల భూదేవికున్నూ రైతులాగున, సస్యశ్యామలమైన ఆకుపచ్చ చీరెలతో పచ్చగాపూచిన బీరపాదులలాగున వంటినిండా సువర్ణాభరణాలతో, పిల్లలకు తల్లిపాలిచ్చునట్లుగా పయఃపూరంబులైన నదీనదంబులతో ఆ రెండు మాసాలు వరలక్ష్మీనోముల కోసం పుట్టినింటికి వచ్చిన తోబుట్టువులవలె కన్పిస్తాయి. ఇదంతా నా భావప్రపంచమే అనుకోండి, ఈశ్వరప్రభావ ప్రపంచమే అనుకోండి. చైత్రవైశాఖాల విషయంలో నాకు నుకురూరభావం గాని, కోమలి యందుండే కోమలత్వం గాని కన్పించడం లేదు. మొత్తమీద ఈ రెండున్ను మధుమాసములు అనగా ఒక్కటే విశిష్ట లక్షణం గల వసంతఋతువులో చేరినవి. పౌరుషం హెచ్చేరోజుల ఇవి. మధుపానం చేసేవాళ్ల చేత మరింత మధుపానం, మద్యపానం చేయించే రోజులివి. హిట్లరు కూడా యీ వసంత ఋతువులోనే మళ్లీ చిగిరించి చేవబట్టి కొత్త సైన్యాలను చేర్చుకొని, నిప్పులు చెరుగుతూ, చిచ్చుబాంబులు వేస్తూ చండ ప్రచండంగా మండిపడ తానంటున్నాడు. ఆఖరుకు అంతే అవుతాడేమో. యుద్ధం చేసి చేసి చిట్టచివరకు ఎక్కడో వాడే మండిపడతాడు. ఏకట్టెను నిప్పు ఉంటే ఆ కాష్ఠమే కాలిపోయి చిట్టచివరకు మసి అవుతుంది. కాని, ఇది వెంటనే తుదముట్టే ఘటం కాదు. బ్రిటిషువారికి కూడా యీ సంగతి పూర్తిగా తెలుసు. మూడు చెరువుల నీళ్లు తాగించి ముప్పతిప్పలు పెట్టకుండా శత్రువును విడిచిపెట్టరు. పట్టుదలవస్తే ప్రీవికవున్సిలుకు కూడా వెడ్తారు, క్రింది కోర్టూ, హైకోర్టూ, ప్రీవి కవున్సిలుకూ వెళ్లి మూడు కోర్టులూ తిప్పి నోరు మూయిస్తారు. ప్రస్తుతం రష్యాలోనే ఉన్నాయి హిట్లరునేనలు. అక్కడ మంచుగడ్డలలోనే చాలా కాలము జర్మనునేనలు గడ్డకట్టుకొని స్తంభించి పోయినాయి. అది అయినతర్వాత, ఆఫ్రికాలో లిబియాలోని మండిపోయే ఎండలకు జర్మనునేనలు హరించి ఆవిరి అయిపోవలసిందే. ఇంగ్లండుమీదకు పోదామా అంటే నలువైపుల సముద్రంఉంది. జర్మను వాహినులకు అక్కడి సాగరసంగమం తప్పదన్నట్లుగా ఉంది. అమెరికామీదకు పోవడంఅంటే అది ఇక అమరలోకానికి పోవడమే అవుతుంది. ఏదీ లేకపోతే వీరస్వర్గమైనాలభిస్తుందనే ధైర్యంతో, ఇంకా బడాయిళోసం లడాయి సాగిస్తున్నట్లుగా ఉంది. కాని యీహిట్లరుకు ఇంతి రాజ్యదాహం ఎందుకుపుట్టిందో ఎవడికీ అర్థం కావడంలేదు.

రష్యాలో కాకసను పర్వతప్రాంతాలలో అపారమైన కిరసనాయిలుగనులు ఉన్నాయి వాటిని ఆక్రమించి వశపరచుకోవలెననే ఆశతో అంబరవీథిలో విమానాలమీద పరుగెత్తుతున్నాడు. మొత్తం మీద కిరసనాయిల కాంక్షపుట్టింది. రుమేనియాలోని కిరసనాయిలుగనులు తీసుకుంటే అవి చాలలేదు. తనవిమానాలకు తనమోటారులకు ఇంకా పెట్రోలు కావాలంటున్నాడు. ఈ ప్రపంచంలో సప్తసముద్రాలలో భగవంతుడు పాలసముద్రం పెరుగుసముద్రం సృష్టిచేసినట్లుగా కిరసనాయిలు సముద్రంగాని, పెట్రోలుసముద్రంగాని సృష్టిచేసినట్లయితే హిట్లరుకు పుట్టిన పెట్రోలు దాహముగాని కిరసనాయిలు దాహంగాని తీరుతుందేమో.—పోనీ, కోరినంత పెట్రోలియస్తే ఏంజేస్తాడయ్యా? అంటే, ఇంకా విమానాలూ, టాంకులూ వృద్ధిచేసి ఇంకా యుద్ధాలుచేసి పదునాలుగులోకాలూ నేనేజయిస్తానంటాడు. పెట్రోలు ఇచ్చిన కొలదీ, విమానాలూటాంకులూ హెచ్చిస్తాడు విమానాలూ టాంకులూ వృద్ధిచేసినకొలదీ ఇంకా పెట్రోలు కావలెనంటాడు. ఈ పెట్రోలు దాహం ఎప్పటికి తీరుతుందో తెలియకుండా అనంతంగాఉంది. ఇంత విపరీతదాహం పుట్టడమే దౌర్భాగ్యలక్షణం అదే దరిద్రలక్షణం అందుకనే "అగ్గలమగు తృష్ణ ఎవ్వనికి గాఢదరిద్రుడు వాడెపో!" అని భర్తృహరి అన్నాడు, "తృష్ణదీర్చఁ కోర్కె, తృష్ణనే పెంచు."

పూర్వకాలంలో మనవాళ్లు మాత్రం విమానాలు నిర్మించలేదా? విమానాలెక్కి తిరగలేదా? కాని, ఆ కాలంలో ఇటువంటి పెట్రోలుదాహం లేదని నా నమ్మకం. ఆ విమానాలన్నీ ఆ కాలంలో పెట్రోలు లేకపోతే, మరేవిధంగా నడిపించారు? ఆ కాలంలో వాళ్లకు కిరసనాయిలు అంటే ఏమిటో తెలియదంటారా? అట్లాగయితే, భర్తృహరి సుభాషితంలో, నూర్ఝపద్ధతిలో, "తివిరి ఇసుమున తైలంబు దీయవచ్చు" అని ఎందుకన్నాడు? ఇసుకలోనుంచి కూడా తైలం తీయవచ్చునని అన్నాడు గదా, మట్టిలోనుంచీ, నేలలోనుంచీ త్రవ్వితీసిన తైలమంటే కిరసనాయిలు కాకపోతే మరేమిటి? పూర్వకాలంవాళ్లకు యీ మట్టినూనె తెలియదంటే నేను ఒప్పుకోను. కాని, ఆ మట్టినూనెను బాగా శుద్ధిచేసి పెట్రోలు తయారుచేసి, ఆ పెట్రోలుతో విమానాలు నడిపించినారా అనే విషయం నేను చెప్పలేను. కాని మా చిత్రవాడలో నేతి బసవయ్యగారని ఒక గోటక బ్రహ్మచారి ఉన్నాడు. ఆయన మాత్రం మన పూర్వులు వాయు విమానాలన్నీ ఆవు నేతితో నడిపించారని వాదించేవాడు— ఆయనకు యోగశాస్త్రం బాగా తెలుసునని మా ప్రకాశరావు నాతో అనడంవల్ల, నేను కూడా ఆయనతో ఈవిషయమై కొంత శాస్త్రచర్చ చెయ్యవచ్చునుకొన్నాను. ఆయన నాతో సహేతుకంగా కొన్ని విషయాలు తన నేతివాదానికి అనుకూలమైన అనుమాన ప్రమాణాలతో వివరించాడు. బసవయ్యగారు చెప్పినదేమిటంటే,—

యోగాభ్యాసం నేను చాలా కాలం చేశాను. యోగాభ్యాసం చేసే కాలంలో ఆవు నేతితో చేసిన పదార్థాలే ఎక్కువగా తినాలి. లడ్డూలుగాని, హల్వాలుగాని, యితర ఏ పిండివంటలుతిన్నా, ఆవు నేతితో చేసినవే తినాలిగాని, నూనెగాని కల్తీ నెయ్యిగాని పనికిరాదు. అనేక హల్వాలలో ఆవు నేతిని ఎక్కువగా వేస్తూ బాగా కుంభక రేచకములతో ప్రాణాయామము చేస్తూఉంటే శరీరం అంతకంతకు తేలికగా గాలిలో తేలేటట్లు చెయ్యవచ్చు. లఘిమాగరిమా అణిమాద్యష్ట సిద్ధులు కూడా పొందవచ్చు. నేను యీ ప్రకారంగా ఆవు నేతి మహిమవల్లనే భూమిపైన జానెడు ఎత్తు వరకు లేచాను. క్రమేణా సాధకంచేస్తే ఇంకా మూరెడుఎత్తుకు లేవగలిగే శక్తివచ్చేది ఆవునేతిలో అటువంటి ప్రభావంఉంది. పరకాయ ప్రవేశం కూడా అవలీలగా చెయ్యవచ్చు. ఆవు నేతిని నేవిస్తూ ఉంటే మనలో ఉన్న హంస అంతకంతకు అతి లఘువుగా ఊర్ధ్వసంచారంకూడా చేయగల్గుతుంది. బ్రహ్మచర్యంగా ఉండి కమ్మని ఆవునెయ్యి సేవిస్తే అవలీలగా అహం బ్రహ్మ అని తెలుసుకోవచ్చు. ఆబ్రహ్మకువాహనమే ఈహంస. ఈహంసకుకావలసింది నీళ్లులేనిచిక్కనిపాలు యోగాభ్యాసం చేస్తూ, బ్రహ్మచర్యదీక్షలోఉండి బాగా ఆవుపాలుతాగాలి. ఆవునేతితో, గోధుమపిండితో, చక్కెరతో చేసినపదార్థాలు సేవించాలి. అప్పుడుమాచుకోండి! ఆంజనేయులవారిలాగున ఆకాశవీథిలో ఎగిరివెళ్లవచ్చు. ఒక్కమాటుగా సముద్రం లంఘించవచ్చు నామట్టుకునేను ఎన్నిగోడలు అట్లాదూకియున్నానో, ఎవరికీ తెలియదు. ఈ యోగసాధక పరీక్షకోసం దూకేవాణ్ణి. పట్టపగలు దూకితేపట్టుకుంటారని, అందర్నూ నిద్రపోతూ ఉండేసమయాలలో దూకి నా శక్తికి వేసే ఆశ్చర్యపడేవాడిని. ఆహార విహారనియమాలు ఆవిధంగా పాటించి ప్రత్యేకం ఆవు నెయ్యితో, నా శరీరాన్ని అంత లఘువుగా చేయగల్గినప్పుడు, ఆకాశవీథిలో విహరించవలసిన విమానములనుకూడా ఆకాలపువాళ్లు ఆవునేతితోనే నడిపించారని నాసిద్ధాంతం ఆకాలంలో ఆవునెయ్యి అపారంగా సమృద్ధిగా ఉండేది. యజ్ఞయాగాదులలోకూడా అగ్నిహోత్రునకు ఆవునెయ్యి అనేక డబ్బాలు ఆహుతియిచ్చేవారు. ఈకాలంలో పిశెరూ, 2 లయితే, ఆ కాలంలో మణుగురూ, 2 లు కూడా ఉండేదికాదు అయినా యీ కాలంలో అసలైన ఆవు నెయ్యికూడా ఎక్కడిది? అందుకనే యీ కాలపు విమానాలన్నీ పెట్రోలుతో నడిస్తున్నారు." అని నేతిబసవయ్యగారు చెప్పిన దంతావిన్నాను కాని ఆయనను మాత్రం భూమిమీదనుంచి జానెడుకాదుగదా, బెత్తెడుకూడా లేవగల్గినస్థితిలో లేడు. ఆయన ఎక్కడ భోజనానికివెళ్లినా, ఝారీలతో ధారాప్రవాహంగానేయిరుమ్మరించవలసిందే —"ఈ ఘటానికి నెయ్యిపడకపోతే, వాసన హింసించడమవుతుంది" అని వాదించి, ఎవరింటికి వెళ్లినా స్వతంత్రంగా నెయ్యి అడిగి వడ్డించుకొని చెక్కభూటుగా భోంచేస్తాడు. భోజనానంతరం, యీ వేసవికాలంలో భుక్తాయాసంచేత, పాపం! ఆ ఉదరభర్త విరహతాపం ఇంతా అంతా కాదు. నేతిదాహం మూలంగా నీటిదాహం ఎక్కువైంది ఉదరం యావత్తూ నేతి టాంకులాగున ఉండేది. ఘృతం అంటే అమృతంగా తాగుతాడు. కాని, ప్రస్తుతం ఇద్దరు నుస్గురు పట్టి పైకెత్తవలసిన స్థితిలో ఉన్నాడు. బసవయ్యగారి నేతివాదంలో నాకు హేతువాదం కన్పించలేదు.

అయినా, యీ మండువేసంగిలో హిట్లరుకు పెట్రోలు దాహం పుట్టినట్లుగా బసవయ్యగారికి నేతిదాహం ఎక్కువైంది. ఈదాహం ఎక్కువైనకొలదీ దేహం పెరుగుతోంది. అందుకు సందేహము లేదు. దీనికంతకూ వెర్రి వ్యామోహమే కారణం తనకు అందువల్ల మహాద్భుతశక్తి లభిస్తుందనే భ్రమ కలిగి భ్రమ పడుతున్నాడు కనుక వ్యామోహం లేనివాడికి దాహమే లేదు. ఏ వృత్తిలో ఉన్నా, ఇహం పరం గ్రహించి అహం నిగ్రహించితే, వ్యామోహమూ ఉండదు; విపరీతమైన ద్రవ్యదాహమూ ఉండదు. అతని దేహం ఖుషీలోహంగా ఉంటుంది. బుద్ధిశుద్ధిగా ఉంటుంది, రైలుగుమాస్తాయినాఅంటే, జైలుగుమాస్తాయినాఅంటే కలెక్టరయినాఅంటే, టికెట్టుకలెక్టరైనాఅంటే, కాపురంచేసే స్త్రీఅయినా అంటే, కంట్రాక్టు మేస్త్రీఅయినా అంటే, వ్యామోహం ఎక్కువైతేనే దాహం ఎక్కువవుతుంది. అందాకా ఎందుకు? ఒకయిల్లాలు కొత్తచీర కట్టుకుంటే, ఎంతో సూడముచ్చటగా సొంపుగా శోభస్కరంగా, శోభిస్తుపెళ్లికూతురు కొత్తలాగుంది. ఆ కొత్తచీర వ్యామోహంలో ఆబిల్బోకపతి కబ్బితబ్బిబ్బయిపోయింది. కాని పండితులు మెచ్చనిప్రసంగం, సాటివారు మెచ్చని శాటిలో భిస్తుందా? అందరూ మెచ్చి ఆనందించిందే అందం. అందుకని యిరుగుపొరుగు యిల్లకు, తిండితిని తీరికగా ఉన్న ఎండవేళ, బయలుదేరింది. ఇంటింటికీ ఎండలో తిరిగిన కొలదీ, దాహమెక్కువైంది కొత్తచీరకట్టుకొంటే యింత దాహమెందుచేతనని ఒకయిల్లాలిని అడిగింది. నిజంగా, ఆకొత్తచీర వ్యామోహం లేకపోతే, ఇన్నియిళ్లయిల్లాలు ఎండలోపడి తిరిగేదీ కాగు, అంతదాహం అయ్యేదీ కాదు.

ఈ చిత్రభాను సంవత్సరంలో చిత్రవాడలో, అందరికీ పత్రికల దాహం మాత్రం ఎక్కువైంది — ఎవడి చేతులో సైనా ఆంధ్రపత్రిక కన్పిస్తే చాలు ఏదిమందీ వాడినిముట్టడించి కదలనివ్వకుండా 'యుద్ధ మెట్లా ఉంటుందీ!" అని ప్రశ్నతర పరంపరలతో బాధిస్తారు. ఈముట్టడికి వాడు తాళలేక, తెల్లజెండా పైకెత్తవలసివచ్చినట్లుగా, పత్రిక పైకెత్తి, "ఇదిగో చదువుకోండి ఇతమందికి ఒక్క మాటుగా నేను జవాబు చెప్పలే" నని సలాము చేసి శరణువేడి 'పని ఉంది వెళ్లవలెను—క్షమికచండి" అని ప్రార్థిస్తాడు. మా ఊళ్ళోవాళ్లకు పత్రికదాహం ఎక్కువ అయితే, పత్రికలకు కాగితాల దాహం ఎక్కువైంది.



గ్రంథ విమర్శ

నిర్మాణ కార్యక్రమము—కొన్ని సూచనలు

గాంధిమహాత్ముడు ప్రతిపాదించిన 18 అంశాల నిర్మాణ కార్యక్రమ ప్రణాళికను పరిచయంచేయడానికి రాజేంద్ర ప్రసాదుగారు ఇంగ్లీషులో రచించిన కొన్నిసూచనలను శ్రీయుత కొ. శరకోపాచార్యులుగారు ఆంధ్రమున ననువదించి ప్రకటించిరి. నిర్మాణ కార్యక్రమ ప్రయోజనమును గ్రహించుటకు అనువాదము మిగుల నుపయుక్తముగ నుండగలదు. వెల రెండణాలు. గ్రంథకర్తపేర కాకినాడని వ్రాసిన యీ పుస్తకము లభించును.

* * *

నోట్సు యిన్ ఎనట్ షెల్

శ్రీ టంగుటూరి శ్రీరాములుగారు (రాజమండ్రి), మద్రాసు 'ఫెడరేటెడ్ ఇండియా'లో 1937, 38 సంవత్సరాలలో ఆంగ్లమున వ్రాసినవ్యాసములు పైపేగుతో పుస్తకరూపమున ప్రచురించిరి. ఇవి రాజకీయ సాంఘిక ఆర్థికాంశములపై స్వతంత్రరచనలని చెప్పవచ్చు. వీరు చెప్పదలచుకొన్నది నిర్భయముగా చెప్పిరి. గాంధిమహాత్ముని సైనము విమర్శింప పెద్దవలేదు. వెనుక 'స్వరాజ్య' పత్రికలోగూడ శ్రీరాములుగారు వ్రాయుచుండువారు. యీ గ్రంథం వెల 8 అణాలు.

వైరాగ్యఘోష

శ్రీ బులుసు వేంకటేశ్వర్లు, బి. ఏ.

"చాలు! చాలింపు! చాలించి స్వస్తి చెప్పు!
పాడుబొమ్మలతో నాటపాటల కిఁక—
స్వాప్నికానంద మాజవంజవమునందు
శృంఖలాబద్ధుఁ డగు బానిసీని జేసె.

ఒక్కత్రుంటిలోనఁ ద్రెంపివేయుము సమస్త
బంధముల నద్వితీయ సౌభాగ్యగరిమ
ఎండమావులభ్రమ వీడి యింకనైన
పరమసత్య పరిగ్రహ భాగ్య మందు.

దివ్యసంకల్ప వైభవ దీప్తివితతిఁ
బరమ నిష్ఠాగరిష్ఠుఁడ వై చరింపఁ
దిమిరమయ మగు జీవిత దృక్పథంబు
బ్రహ్మతేజఃప్రభావ సంవర్ధక మగు.

పరమ నిష్ఠాగరిష్ఠుని వ్రతఫలమ్ము
నత్యసంకల్పసగు నశ్వరవిభూతి
సకల విజ్ఞానమర్మ సంస్తవ మనీష
కరతలామలకములు నీ కగు నిజమ్ము.

ఒక్కవైరాగ్యసంపత్తియుతుఁడె దీనిఁ
గాంచఁజాలును త్యాగమార్గమ్ముఁ బట్టి
సర్వసంగ పరిత్యాగ సాహసంబె
సర్వసంకల్పసిద్ధి నొసంగితీలు."

శ్రీ కార్వేటినగర సంస్థానము

పోలిపెద్ది వేంకటరాయ కవి

వేణుగోపాల శతక గ్రంథకర్త

"కవి-జయచంద్రుడు"

ఈసంస్థానము చిత్తూరుజిల్లాలోనిది. చాలనాదియైనది. ఈ సంస్థానాధిపతులు నానేకమంది పండితులను, కవులను, గాయకులను, శిల్పశాస్త్రజ్ఞులను, పోషించుచుండిరి. వారి వారివిద్యలకై మెచ్చి రాజులచే నొసగబడిన అగ్రహారములను మాన్యములను, మేరలను, యిప్పటికిని జావంశస్థు లనుభవించుచున్నారు. అప్పటికవులలో నగ్రగణ్యుడీ పోలిపెద్ది వేంకటరాయకవి.

ఈతడు 1800 సం॥ ప్రాంతమున గుంటూరు ప్రాంతమునుంచి నిసంస్థానమునకు వచ్చెను, అప్పటిరాజుగారైన, వేంకటపెరుమాళ్ రాజుగారు అనువారు వీరి కవిత్వమునకు మెచ్చి వీరి నాస్థాన పండితునిగ నుంచుకొనిరి. ఇట్లు కొంతకాలము జరుగగా రాజుగారివద్దనుండు కొందరు పెద్దపదవులు పొందిన నీమలు రాజుగారికి వారి (కవి) పైన నసూయ కల్గించిరి. అందుచే రాజుగారు కవికి, "దేవిడీ మాఫీ" (మరు ఉత్తర్వువరకా స్థానమునకు రాకుండునట్లు) ఉత్తర్వు చేసిరి. పిమ్మట నీ కవి యాయాస్థానమునందు గొప్ప యుద్యోగముల పొందియున్న నీచుల చేష్టల ప్రకటింపనెంచి, "వేణుగోపాల శతకము"ను రచించెను. ఇం దుల్లకు గొప్ప యధికారము వచ్చిన నెట్లుండురను విషయమును చక్కగఁ జెప్పెను. ఈతని కవిత్వము పరళమై, గ్రామ్యపదభూయిష్టమై, సర్వజన వేద్యమై యుండును. ఈ కవి చాల నుద్ధతుడనికూడ నీ శతకమువలన తెలియుచున్నది. ఇతను కవియేగాక, పండితు డనికూడ చెప్పవలయును. ఈతనికి నీతిశాస్త్రము, వేదాంతము, జ్యోతిషశాస్త్రము, సాముద్రికము మొదలునవి బాగుగ తెలియునని ఈతని రచన తెల్పుచున్నది. విస్తరభీతిచే పైవాటి కిచటనుదాహరణ మిచ్చుట లేదు. ఈ 'వేణుగోపాల శతకము'న యెనుబది మూడు పద్యములు మాత్రమే యున్నవి శతకమన్నచో వందపద్యము లుండ వలయును. ఇందుకు కారణము — ఈ యెనుబదిమూడు పద్యములచే రాజపరివారగత దోషములఁ జెప్పెను. తక్కిన పదునేడు పద్యములచే రాజగతదోషముల జెప్పనెంచి వారి కీయుపంతకు నెఱుకపఱచెను.

రాజుగారి కవిని రప్పించి, పుస్తకమును చూచి తాను తెలియక నాతని బహిష్కరించినందులకు వగచెను. ఆ శతకము నంతటితోనే ముగించునట్లు చేసెను. అందుచేతనే నీ శతకమున నెనుబది మూడు పద్యములే కన్పట్టుచున్నవి.

పిమ్మట నీ కవికి రాజుగారు 1808 సం॥ "నవరసాలంకార శృంగార వాణివిలాసపురమును" క్రొత్తయముగా నొసగిరి. ఇప్పటికిని ఆ కవి వంశస్థులు ఆ గ్రామము ననుభవించుచున్నారు.

వీరు చేసిన రెండవ గ్రంథము లావణ్యశతకము. రాజుగారు పురుషవిరహమును వర్ణింపుమని ఆజ్ఞాపింపగా నీ శతకమును వ్రాసెను. ఇందలి మొదటిపద్యముచే నావిషయము వ్యక్తమగుచున్నది. "శ్రీమదఖండ లక్ష్మీ ప్రసన్నుడు మా కరాట్ కులాంభోధి, కైరవ హితుండు - సరసుడౌ వేంకట వెంగమాంబ రాజేంద్రు డొకనాడు కొలువు కూర్చుండి నన్నుగని పోలిపెద్ది వేంకటరాయసు కవిం ద్రరమ్మని ప్రేమ మీరంగ పురుష! విరహాంబు శ్రీహరి స్మరణ శృంగారంబు గనుచమత్కృతి శతకం బొనర్చు! మనిన శారదనేక దంతులు నుతించి- నే రచించెద పద్యములన్ నేర్చినటులు! నీకు కృపలేక కృతిచేయ నరిరికైన! వశముఁ బే రామరామ లావణ్య సీమ॥" వేణుగోపాల శతకమునకన్న, ఈ శతకమందలిరచన చాల బాగుగ నున్నది ఇందు యమకారు లున్నవి. ఈకవి సద్ధతుడనట కుదాహరణము.

'పాకంబునకు తగు ఫణితి కానక కీరటము చెట్టనట్లు నేమములు లేక, తెనుగు పాయ్యెడి జాడ తెలియజాలక పెక్కు శృంగార కీర్తులు చేతిగాక, గ్రామ్యపద్యముల క్రమము లెరుంగక జాతీయములుగూర్చు

(2 వ పేజి చూడుడు)

ఈవారపు శుభాశుభాలు

దైవజ్ఞులు రావినూతల ఆంజనేయులుగారు

మేనెల 4-వ తేదీ మొదలు 10-వ తేదీ వరకు వారఫలితాలు

[లగ్నఫలములను జన్మలగ్న, చంద్ర (గోచార) లగ్నముల ననుసరించి గ్రహించునది. దశాభుక్తుల ననుసరించి ఫలితములు మారవచును గాన ప్రమాణములుగ నెంచరాదు.]

ధరలు

పట్టు, ఉన్ని ప్రత్తి, (బ్రోచి)

పట్టు ఆకస్మికంగా ఆతరువాత హెచ్చువచ్చు ప్రత్తిపంట తృప్తికరంగాయుండదు. ధర ఇరుమించు క్రిందటివారంలాగే ఈ వారాంతందాకా యుంటుంది. ముగింపు ధరలు మధ్యధరలకన్నా తక్కువగా యుంటవి. రాజకీయపరిస్థితులే ఇందుకు కారణం.

బంగారు

చెలామణి క్రిందటివారముకన్నా మందముగా యుండును.

వెండి

చలామణి నిలచియుండును.

వాటాలు

యంత్రములు, నూలు, రబ్బరు వాటాలు చలామణి త్వరితముగా హెచ్చును నూనె వాటాలు 7½% వరకు హెచ్చవీలున్నది.

ధాన్యములు - ఆహారవస్తువులు

గోధుమలు స్వల్పముగా హెచ్చును. పల్లు నిలచియుండును. ఎఱ్ఱ ధాన్యములు స్వల్పముగా వారాంతమున తిగ్గును. కాయగూరలు, మిర్చి, నూనె ధాన్యములు నిలచియుండును. పసుపు ధరక్షీర్ 10% వరకు హెచ్చవీలున్నది.

వర్షము

8 వ తేదీవండియు దక్షిణ జిల్లాలలో కొలకరి కలుగును.

లగ్నఫలములు

మేషం

(అశ్వని, భరణి, కృత్తిక 1 పాదము)

ఈ వారంలో ముఖ్యరంగాలన్నిటిలో గూడా స్వల్పశ్రమతో అనుకూలాలు ఏర్పడవి. ఆరోగ్యం బాగుపడుతుంది నౌకరి వృత్తి ఉద్యోగాలు తృప్తికరంగా సాగించ కలుగుతారు. డబ్బు పట్టుబాటు అవుతుంది. సంఘంలో పలుకుబడి హెచ్చుతుంది. ముఖ్యబంధువులనుండి శుభవర్తమానాలు రాగలవు. స్పెక్యులేషన్ అంత లాభించదు. ప్రయాణం 4, 5 తేదీల తర్వాత పొగదు.

6, 7 శ్రమ హెచ్చు స్వల్పలాభం.

వృషభం

(కృత్తిక 2, 3, 4 పాదాలు; రోహిణి, మృగశిర 1, 2 పాదాలు)

ఈ వారాంతంలో గురువు లగ్నాన్ని చేరడంవల్ల ముందు ముందు అనేకపరిస్థితులు తారుమారు అయ్యే సూచనలున్నవి. దేశకాల పరిస్థితులను గమనించండి

ఈవారంలో ఆరోగ్యం సామాన్యంగా యున్నా మనస్సు స్థిరంగా యుండదు వృత్తి, ఉద్యోగాలూ కుటుంబపరిస్థితులు శుభకరంగా యుంటవి. ప్రయాణం సాగదు. ప్రేమ వ్యవహారాలకు భంగం కలుగుతుంది. స్పెక్యులేషన్ నష్టకరం. అనవసరఖర్చులు వర్ధిస్తుంది.

మిథునం

(మృగశిర 3, 4 పాదాలు
ఆరుద్ర, పునర్వసు 1,2,3 పాదాలు)

త్వరలో మీ గ్రహస్థితి ఉన్నతంగా యుండే సూచన లున్నవి. అవకాశాన్ని వినియోగించుకోవడం మీ పని.

ఈ వారంలో మీ ఉద్దేశ్యాలను కార్యరూపంగా యుంచడంలో అవి పేకులతో సంబంధం ఏర్పడవచ్చు. యథార్థాన్ని కప్పిపుచ్చి కుటిలంగా నడుచుకోవలసిన పరిస్థితులు ఏర్పడుతవి. కష్టంమీద మనస్థితిమితం ఏర్పడుతుంది. ఆర్థికస్థితి, వృత్తి, ఉద్యోగాలూ క్రిందటలాగే యుంటవి. ప్రయాణం వెనకబడుతుంది.

కర్కాటకం

(పునర్వసు 4 పాదం, పుష్యమి ఆశ్లేష)

ఈవారంలో మీరు ముఖ్యరంగాల్లో జాగ్రత్తగా నడుచుకోవలసియుంటుంది. సంఘం మీరు యథార్థవాదులనీ, సత్యభాషకై కష్టాలకు కూడా వెనదీయరని గ్రహిస్తారు. సమయంలో ఆదుకుందామని ఒకరు అనుకోరు. ప్రయాణం జరిగితే సుఖం కలుగుతుంది. ఆర్థికపరిస్థితి తాత్కాలికంగా ఏర్పడే సూచనలున్నవి. ఎడమకన్ను నొప్పిగా యుంటుంది. స్పెక్యులేషన్ కొంతలాభం కలిగించవచ్చు నూతన యత్నం చేయండి.

సింహం

(మఘ, పుబ్బ, ఉత్తర 1 పాదం)

ఈవారములో ఆరోగ్య ఆర్థికస్థితులు ప్రోత్సాహకరంగా యుంటవి. ధైర్యంగా శత్రువులతో కలియబడుతారు. వృత్తి, ఉద్యోగాలు తృప్తికరంగా సాగుతవి. సామాజిక కార్యాలు ఉత్సాహంతో చేయకలుగుతారు. బంధుజనులకు సద్భావం కలుగుతుంది. కుటుంబవిషయమై శ్రద్ధ హెచ్చుతుంది. ప్రయాణం తృప్తికరంకాదు.

8, 9 విలాస విహారములయందు శ్రద్ధ, నూతన యత్నం.

కన్య

(ఉత్తర 2, 3, 4 పాదాలు,
హస్త, చిత్త 1, 2 పాదాలు)

శుభవార్త! మీగ్రహస్థితి ఈవారాంతం నుండి శుభస్థితికి వస్తుంది. మీ కష్టాలు తగ్గే సూచనలున్నై.

ఈ వారము మాత్రం మీరు కార్యతత్పరులై మెలగండి లాభంయుండదు. నిత్యం ఏదో ఒక అనుకూలమనుకూల్పు మీ పరిస్థితులలో ఏర్పడుతుంది. శత్రువులు మీకు లొంగేరోజులు వస్తున్నవి. ప్రయాణం నిలుస్తుంది. శుభవర్తమానాలు వస్తవి. కుటుంబంలో సూత్రం కొందరికి ఆనారోగ్యంగా యుంటుంది.

తుల

(చిత్త 3-4 పాదాలు,
స్వాతి, విశాఖ 1-2-3 పాదాలు)

ముందువెనుకలుంచక్కగా ఆలోచించి మీరు ఏ కార్యము చేయరు. అందువల్లనే మీరు చేసే ప్రతికార్యమూ నిర్దుష్టంగా చిరస్మరణీయంగా యుంటుంది. మీలో యుండేలోపం యేమిటంటే తెలిసికూడా మూర్ఖులకు చనువు కలిగిస్తారు. ఈ వారంలో మీ శత్రువులకు శృంగభంగం కలుగుతుంది. వృత్తివ్యాపారాలు తృప్తికరంగానే సాగిస్తారు. కుటుంబవిచారం కలుగుతుంది. 8, 9 లలో ఆహారవిహారాల్లో జాగ్రత్త వహించకపోతే ఆనారోగ్యానికి వీలున్నది.

వృశ్చికం

(విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ)

ఆర్థికంగా ఈవారంలో మీపరిస్థితులు ప్రోత్సాహకరంగాయున్నా మనస్థితి తక్కరంగా యుండదు. వృత్తివ్యాపారాదికుల్లు, స్పెక్యులేషన్ లాభనష్టం, హెచ్చుసూచనలున్నవి. ఉద్యోగస్థితి బాగాయుంటుంది. గృహకలతలు పర్దుబాటు అవుతవి కోర్టువ్యవహారాలు, భూమి పరిష్కారాలు ఈవారంలో చేయకుంటే మంచిది.

9.10 శుభవర్తమానం సంతోషం. మిత్రదర్శనం.

ధనుస్సు

(మూల, పూర్వాషాఢ,
ఉత్తరాషాఢ 1 పాదం.)

ఈవారాంతంనుండి పంచమంలో క్రూరగ్రహబాధ తగ్గుతుంది. ఆర్థికస్థితి, భార్యకు ఆరోగ్యం, వృత్తి వ్యాపారాల్లో ప్రోత్సాహము, హెచ్చుతుంది స్పెక్యులేషన్ బాగాలాభించవచ్చును. ఉమ్మడివ్యాపార పరిష్కారం పైవారానికి వాయిదాకోండి. ప్రేమవ్యవహారాలు లాభిస్తవి. సర్వకార్యములకు అడ్డుతగులుతుంది. 4 5 దినాల్ల ప్రయాణంచేస్తారు. నూతన యత్నానికి ముఖ్యకార్య ముగింపుకూ 4 8 కాంతమేలు.

మకరం

(ఉత్తరాషాఢ 2, 3, 4పాదాలు; శ్రవణం ధనిష్ఠ 1, 2 పాదాలు.)

ఈ వారము మీరు అన్ని ముఖ్యరంగాల్లోకూడా మెలకువకలిగి యుండనిదే మేలు కలుగదు. కుటుంబ పరిస్థితులు మీ మనస్సును కష్టపెడిగా యుంచుతవి. ఆర్థికస్థితి తృప్తికరంగా యుండదు. వృత్తివ్యాపారాల్లో ఎక్కువ మార్పులు యుండవు. కాని స్పెక్యులేషన్ లాభిస్తుంది. ప్రయాణం 6 తర్వాత సాగదు. విద్యయందు శ్రద్ధతగ్గుతుంది. నూతన యత్నానికి 2, 4, 6, 9 అనుకూలం.

కుంభం

(ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1, 2, 3 పాదాలు)

ఏ యత్నం ప్రారంభించినా బాగోగులు చక్కగా యోచించందే చేయరుకాని, చివరకు ఫలం స్వల్పంగానే మీచేతికి అందుతుంది. 10 నుండి గురుబలం కలుగుతుంది

ఈ వారంలో మీ వృత్తి వ్యాపారాల్లో మీకృషి కొంతవరకే ఫలిస్తుంది. ప్రయాణం సాగదు. వృత్తివ్యాపారాల్లో మార్పులే వీ యుండవు చరాస్తిపరిష్కారం అసలే తలపెట్టవద్దు. ఆర్థికస్థితి, ఆరోగ్యం బాగానే యుండేసూచన లున్నవి. శుభవార్తవస్తుంది.

మీనం

(పూర్వాభాద్ర4పాదం, ఉత్తరాభాద్రలేవట)

ఈ వారంలో మీ ఆరోగ్య ఆర్థికపరిస్థితుల్లో ప్ర

మాతృభాషా పాండిత్యావశ్యకత

విశ్వనాథ సత్యనారాయణగారి యుపన్యాసము

ఏలూరు సాహిత్యమండలి వార్షికోత్సవము

ఏలూరు, ఏప్రెలు 25.—

ఏలూరు సాహిత్యమండలి తృతీయ వార్షికమహాసభలు శ్రీ చుండూరివారి సత్రమున వేయబడిన విశాలమగు పందిరిలో నేడు జరిగియుండెను. మహాసభలకు, శ్రీ తల్లావఝుల శివశంకర శాస్త్రిగారు రథ్యక్షతవహించిరి. సభకు పెక్కురు కవులు వచ్చియుండిరి. శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారూ శ్రీ శ్రీరంగం శ్రీనివాసరావుగారు, దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు, మున్నగువారు వచ్చియుండిరి.

శ్రీ సుత్తిన సుబ్రహ్మణ్యంగారి దైవప్రార్థనతో సభ ప్రారంభమయ్యెను. అనంతరము శ్రీమతి చుండూరు రత్నమ్మగారు భారత కీర్తనము గానించిరి.

శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు

అనంతరము శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు తమ ప్రారంభోపన్యాసమొసంగుచూ, కవిత్వాత్మను గురించి ముఖ్యముగా యుపన్యసించిరి.

అనేక కవులు కవితావస్తువును పరిగణింపకుండ, కవిత్వమున కలంకారము ఉపమానాది బాహ్యాలంకారములు సమకూర్చుటచేత నే సంతృప్తిచెందెదరు. శరీరమునకు ఆత్మ యెట్టిదో, కవిత్వమునకు కవితావస్తువు అట్టిది అట్టి కవితాత్మలేనికవిత్వము అలంకరింపబడిన శవమువంటిది. గాని ఈ కవితాత్మ నిర్ణయము, ఆయావ్యక్తుల ప్రతిభ ననుసరించియే యుండునుగాని నిర్ణీతముగా చెప్ప అంతవీలుపడదు.

మాతృభాషా పాండిత్యావశ్యకత

కవికి స్వతశ్శిద్ధమైన విమర్శనాజ్ఞానము లేవలెనని అతడు మున్ముందు మాతృభాషా పారంగతుడు గావలెను. మాతృభాషాజ్ఞానము పూర్తిగా సంపాదింపకుండ, పరభాషాజ్ఞానము ముందుగా ఎంత సంపాదించినను, అతడా భాషావేత్తల భావములకు దాసుడై, శబ్దార్థదాస్యమున బంధింపబడుట తప్ప స్వతంత్ర విమర్శనాప్రజ్ఞ యతనికి కలుగదు. అందువలన మన మెంత ఆంగ్లము జదివినా ఆంగ్లేయులా భావములో సంపాదించు ప్రజ్ఞను సంపాదింపలేము. వారు తమ మాతృభాష కత్యంత ప్రాముఖ్యత నిచ్చుటవలన నేనారెట్టి భావదాస్యమునకు లోబడుటలేదు మనవారో, అట్టి భావదాస్యమునకు లోబడి, ఆంగ్లేయుల పోకడలే సరియైనవని, మన ప్రాచీనకవులపద్ధతులు సరియైనవనిగానీ, వీరిని మార్చుచేయవలెననీ అనుకొనుచున్నాము. గాని నూతన పద్ధతిని పోయిననూ కూడ, క్రొత్తపాతల కలియకను బాగుగా సమన్వయముజేసి, బాగుగావ్రాసిన కవులు యిర్వురే నేడు మనకు కన్పించుచున్నారు. వారు దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు, శ్రీ. శ్రీగారు.

అని శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు నుడివిరి.

అనంతరము సాహిత్యమండలి కార్యదర్శి శ్రీ కాండ్రేగుల రామచంద్రరావుగారుమండలి 8 వ వార్షిక నివేదికను జదివిసమర్పించిరి.

అధ్యక్షోపన్యాసము

అనంతరము మహాసభాధ్యక్షులైన శ్రీతల్లావఝుల శివశంకరశాస్త్రిగారు ఉపన్యసించారు.

"సాధారణంగా నాంసారిక కష్టనష్టములచే నిండియున్న ఈజాతికలోకమునుండి మనలకు కొలదికాలమైననూ, స్వీయమనోనిర్మితమైన ఆనందమయ, రసమయ ఊహాప్రపంచములోనికి గొనిపోయి, మనసున కానందాదానుభూతిని గల్పించుటయే సాహిత్యముఖ్యోద్దేశము. ఇట్లుచేయుటకు సాహిత్యమే యుత్తమ మార్గము.

అట్టి సాహిత్యమునందు కూడ, అనుదినము అనుభవమగుచున్న సామాన్యకష్టములను వర్జింపవలెనను భావములో నేనేకీభవింపజాలను. వాననునుదినము చూచుచూ కష్టమనుభవించుదునే యున్నాము. అట్టియెడ మనము నిర్మించు కవితాప్రపంచమునందుగూడ అమంగళకరములు జుగుప్సాకరములు అగువానినే భావించుటవలన ప్రయోజనమేమి?

ఇక కవిత్వమునకు వ్యాకరణము, ఛందస్సు, అలంకారములు మున్నగునవి ప్రతిబంధకములనువారితోగూడ నే నేకీభవించను. అట్లు తలచువారిపై నాకు గౌరవము లేదు. అలంకారశాస్త్రము కవిత్వమునకు రాజమార్గమువంటిది. వ్యాకరణము మిత్రునివంటిది. గాన వీనిన్నిటిని సులభసాధ్యములు గావించుకొని ప్రాచీనకవుల మార్గములను బాగుగా గుర్తెరిగినవాడు గాని ఎవడునూకవి కానేరడని నాయభిప్రాయం అసలాంధ్రమున కవికావలెనని సంస్కృతభాషాజ్ఞానముండితీరవలె నడివారిలో నేనొకడను నవ్యకవులలో కొందరు పాండిత్య ప్రకర్ష యెక్కువైన కవిత్వ ప్రవంతు లింకిపోవునని అందురు. ప్రకర్ష యెక్కువైనట్లు జరుగునేమోగాని, పాండిత్యమువలన గల్గువిశేష విషయపరిజ్ఞానమువలన నష్టమేమి?

ఇక కొందరు అందరకూ అర్థమయ్యేరీతిని కవిత్వము వ్రాయవలె నని అనుచుందురు. అందరనిన ఎవరు? ఆంధ్రదేశములోని ఆబాలగోపాల మనియా వీరి భావము. ఒక సామాన్యవాక్యము మాట్లాడినను, అందరూ అర్థము చేసికొన గలరా? పరీక్షించి చూచినచో చదువుకొనిన వారమనుకొనువారికి గల పదజాలముగూడ అత్యల్పమైనపుడు, సామాన్యుల పదజాల మెంత ఇట్లని నే వనినచో సామాన్య ప్రజలపై నీ కాదరణలేదని యందురు. నేను పురాణోక్తసిద్ధాంతము నంగీకరించువాడను, గాన ఎట్లకొనినను పరవా లేదు.

దైవందివానుభవము లైన విషయములపై తిరిగి కవిత్వము వ్రాయవలెనా? దైవందివానుభవములకాని విషయముల దెల్పినచో, వాని కర్థ మసునట్లు చేయుటకు పౌరాణికుని వలె మరొకరు కావలెనుకదా. ఇట్టిస్థితిలో చేయవలసిన దేమి, అను యుద్దేశములతో, నేడు కళోకమున ఇతికర్తవ్యతా మూఢత విస్తరించియున్నది. గారావిధముగా, ఎంతమాత్రము తలపోయవలదనీ, తమ స్వబుద్ధికి తోచినట్లు కవిత్వము వ్రాయవలసిన దనీ, భావనని కాని కీర్తికాముకత్వమువలన గాని, వైలక్షణ్యమే దో మాపింపవలెననెడి యుద్దేశముతోగాని, కవిత్వము చేయరాదు. కామిని విషయములోగాని, కీర్తికామి విషయమునగాని, స్వయంగ్రాహమున రసమున్నదిగాని, వెంటబడుటవలన రసభంగము తప్ప లాభముండబోదు.

ఇంక లోకోపకారమునకై కవిత్వము చేసెదనని లోకమును బాగుచేయుదుననీ అనుకొనుకవి మూర్ఖుడునూ, మందబుద్ధియూ యని నాతలంపు. అని శ్రీ శివశంకరశాస్త్రిగారుపన్యసించారు.

చిత్రకళాప్రదర్శన ప్రారంభోత్సవము

శ్రీ అడవి బాపిరాజుగారు

అనంతరము మండలి వార్షికసభల తరపున ఏర్పాటుచేయబడిన చిత్రకళాప్రదర్శన ప్రారంభమును శ్రీ అడవి బాపిరాజుగారు గావిస్తూ ఈక్రిందివిషయము లుపన్యసించారు

కవిత్వమునకు చిత్రకళకునూగల సన్నిహిత సంబంధమును ఈ మండలివారు గుర్తించి చిరనుటను వారి రీవిధంగా మండలి వార్షికసభల సందర్భమున చిత్రకళా ప్రదర్శన మేర్పర్చుటయే ప్రబల నిదర్శనము.

నేటి ప్రదర్శనములు చూచినవారికి ఈ చిత్రములు స్వాభావికములుగానవి, అవి వంగదేశమునుంచి అనుకరింపబడిన చిత్రకళలని భావిస్తారు.

శిల్పం ప్రథమంలో ఉత్తరహిందూస్థానంలో ప్రారంభమైనా ఆశిల్పమును నిజముగా అభివృద్ధిచేసి, జగద్వ్యాప్తము గావించిన ప్రతిభ ఆంధ్రులదే, అజంతా ఏల్లోరాశాకన్న వాసనగుహలలోనుండి ప్రపంచమున కంతకు విస్మయము కల్గించు చిత్రకళ ఆంధ్రులదే కాలక్రమమున వ్యాప్తియించి తగ్గిపోయిన ఈచిత్రకళలను ముందు బెంగాలీవారు మరల వ్యాప్తిలోనికి తీసికొనిరాగా, ఆంధ్రులు వారివద్ద నేర్చుకొని, ఈ కళ. బెంగాలీ వారిది అని అనుకొనుచున్నారు.

చిత్రకళ అర్థము చేసికొనుస్థితిలో కూడ మనము నేడులేము. రవి వర్మ పటములు కాలెండర్లు, చూచుట కసహ్యకరమగు అడ్వర్టైజు మెట్లతోకూడ గోడల నలంకరింపచేసికొనుట అలవాటైనదిగాని, ఒకచిత్రకారునిచే చిత్రింపబడిన సుందరచిత్రమును కొనియైన గృహము నలంకరించుకొను అలవాటు పోయిన దనిరి.

మధ్యాహ్న కార్యక్రమము

మధ్యాహ్నము సభలుప్రారంభ మగుటకు ముందు శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారి అధ్యక్షతమ కవితాగోష్ఠి జరుపబడెను. అందు శ్రీయుతులు పైడిపాటి సుబ్బరామశాస్త్రి, శ్రీ రంగం శ్రీనివాసరావుగారు, కొనకళ్ళ వెంకటరత్నం, మానాప్రగడ సుబ్బరాయశాస్త్రి, అడవి బాపిరాజుగార్లు తమ రచనలను వినిపించిరి.

వచ్చిన అతిథుల కందరకును మండలి అధ్యక్షులు శ్రీ చుండూరి శ్రీరాములుగారల్పాహారము దొసంగిరి.

అనంతరము శ్రీ శివశంకర శాస్త్రిగారి అధ్యక్షతను సభ మరల సమావేశ మయ్యెను శ్రీయుతులు జటావల్లభుల పురుషోత్తంగారు సంస్కృత వాఙ్మయమునుగురించి శ్రీ భమిడిపాటి కామేశ్వరరావుగారు భారతమందలి శాంతిఅనుశాసన పర్వములగూర్చి శ్రీ అక్కిరెడ్డి సత్యనారాయణగారు కవిత్వ ప్రయోజనమునుగూర్చి యుపన్యసించిరి.

హిట్లరు ఈ సంవత్సరము నాశనమగును

స్టాలిన్ విశ్వాసము

లెనిన్‌గ్రాడురంగమున జర్మను నష్టము

మాస్కో, మే 2:—

"హిట్లరు ఈ సంవత్సరమున నాశన మొనర్పబడును" అని స్టాలిన్ ప్రకటించినట్లుగ శుక్రవారంరాత్రి మాస్కోరేడియో జర్మను భాషలో ప్రసారించుచూ తెలిపినది.

100 జర్మను విమానములనష్టము

సోవియటు నిడిరాత్రి ప్రకటన ఇట్లు తెలిపినది:—

మే 2 న యుద్ధరంగమున ముఖ్యమైన దేమీ జరగలేదు. సరిచూడబడిన లెక్కల బట్టి ఏప్రెలు 30 న ముందు తెలిపినట్లు 31 గాక 58 జర్మను విమానములు నాశన మొనర్పబడినవి మే 1 న 47 జర్మను విమానములు నాశన మొనర్పబడినవి. మావి 12 విమానములు నష్టమైనవి" మే 2 ప్రకటనలో బారెంట్సు సముద్రమున 9 వేల టన్నుల శత్రు రవాణా నౌకలు ముంచబడిన వని తెలుపబడెను.

లెనిన్‌గ్రాడు రంగమున జర్మను నష్టముల కథ

మాస్కో, మే 1:—

లెనిన్‌గ్రాడును పట్టుకొను యత్నము నందును, ఏప్రెలు నెలలో లెనిన్ గ్రాడు రంగమునను జర్మనులకు కలిగిన జన వస్తు నష్టం గురించి లెనిన్‌గ్రాడు రంగమున సహాయనాయకుడైన మేజరు జెనరలు గుంచేవు ప్రత్యేక ప్రకటన చేసినాడు. ఈ ప్రకటన లెనిన్ గ్రాడు నగరంలో మే-డే సభలో చేయబడి అక్కడనుండి ప్రసారింపబడి, మాస్కోమల్లీ తెలిపినది.

యుద్ధం మొదటి ఎనిమిది మాసాలలో లెనిన్‌గ్రాడు గోరిల్లాలు 16075 మంది జర్మనులను, ఫిన్నులను, 629 మంది అధికార్లు, 11 మంది కల్నలులు, ముగ్గురు సేనానులతో సహా, చంపివేసిరి. ఏప్రిలు నెలలో లెనిన్‌గ్రాడురంగమున జర్మనులు 58 వేల మంది హతక్షతులకు గోల్పోయిరి. వారివి 109 ఫిరంగులు, 100 బాంబసులు, 13 బాంబసు దళములు, 147 మరఫిరంగులు, 45 టాంకులు, 425 లారీలు, విస్తారమైన యితర సామగ్రి నాశన మొనర్పబడెను. ఆదేశాలమున రమ్యసేనలు 19 టాంకులను, 8 కవచిత మోటార్లను, 195 ఫిరంగులను, 215 బాంబసులను, 1108 మరఫిరంగులను, 429 ఆటమాటిక్ తుపాకులను, 4688 తుపాకులను, 40 లక్షలతోటాలను, 13 వేల చేతి సుండ్లను, విస్తారమైన యితర ఆయుధములను, యుద్ధసామగ్రిని పట్టుకొనెను. అని మేజరు జెనరలు గుంచేవు తెలిపెను.

రష్యా-జర్మనీ యుద్ధం ప్రారంభమైన తర్వాత రమ్యసేనా కాదళమునకు చెందిన విమానములు, విమానఘ్నశతఘ్నులు కలిసి మొత్తం 71 శత్రువిమానములను నాశనంచేసిన ని శత్రునౌకానష్టం గురించి తెలుపుచూ మాస్కో రేడియో చెప్పినది.

విశేషాలు లేవు

లండను, మే 1:—

ఆనలిస్టు వ్యాఖ్య:—

రష్యారంగమున ముఖ్యమైన సంగతులు లేవు. కర్పి ద్వీపకల్పమున రమ్యసు పురోగమనం గురించి జర్మను అధికారప్రకటనలు తెలిపినను, రమ్యసులు గ్రువపరచుటలేదు. రమ్యసులు చెప్పుమాటలు అబద్ధములని రుజువు చేయవలెనన్న ఉద్దేశంతో జర్మనులు రమ్యసు విజయముల గురించి కావాలని వార్తలను కల్పించుచున్నారు.

రష్యాలో 15 వేల జర్మను విమానాలనష్టము

మాస్కో, మే 3:—

మార్చి 22 ఏప్రెలు 22 మధ్య జర్మనులు 1018 విమానములను గోల్పోయిరని సోవియటు విమానదళమునకు చెందిన మేజరు జెనరలు గ్రిండాలు తెలిపినట్లు సోవియటువార్తా సంఘము ప్రకటించినది. ఆదేశాలమున సోవియటు విమానములు 391 నష్టమైనవని.

జర్మనీ-రష్యా యుద్ధం ప్రారంభం తర్వాత జర్మనులు 15 వేల విమానములను సుమారు 40 వేలమంది పైమానికులను గోల్పోయిరి.

ఇరాకు ఇరాను దేశాలకు ఆరుపుకవులు సహాయ్యం

రూజువెల్టు వాగ్దానం

వాషింగ్టను, మే 2:—

ఇరాను ఇరానుదేశాల రక్షణ అమెరికాకు ముఖ్యమగుటబట్టి ఆదేశాలకు ఆరుపుకవులు సహాయ్యం అందజేయబడునని రూజువెల్టు అధ్యక్షుడు ప్రకటించెను.

నియంతల సమావేశం

సైనికవిషయాలను చర్చించారని ఊహ

చర్చయందు ఫ్రాన్సు విషయంకూడా వచ్చెను.

తూర్పురంగానికి ఇటలీ ఎక్కువ సేనలను బహుశా పంపును

స్టాక్‌హోము, మే 2:—

హిట్లరు ముసోలినిగార్లు రాజకీయ విషయాలకంటె ఎక్కువగా సైనిక విషయాలను చర్చించారని నమ్ముచున్నట్లును, యీ సమావేశము పర్యవసానముగా తూర్పురంగానికి ఎక్కువగా ఇటాలియనుసేనలు పంపుట బహుశా జరుగవచ్చుననియు స్వీడిష్ వార్తాపత్రికలు బర్లిన్ విలేఖరులు సూచిస్తున్నారు.

రాజకీయవిషయములందు ఫ్రాన్సు విషయము ముఖ్యముగా చర్చకు వచ్చినట్లు యీ విలేఖరులు నమ్ముచున్నారు. సైను, కార్సికాటూనిసు ప్రదేశాలు ఇటలీకి కావలెనని యిటీవల మళ్లీ ఆందోళన జరిగియుండెను. కాని ప్రస్తుతపరిస్థితిలో ఇటలీ, విషీ ఫ్రాన్సను ఆ విషయమున తొందర పెట్టకుండా జర్మనీ ఒత్తిడి చేస్తున్నదని విలేఖరులు సూచిస్తున్నారు.

లిబియాలో స్థితిగతులు ఫ్రెంచి కాలనీ పైభాగమైన ఆధారపడియుండే విషయమున హిట్లరు బాగా గ్రహించియే ఫ్రెంచి కాలనీలను, యేమాత్రం విచ్ఛిన్నపరుచుట శ్రేయం కాదని జర్మనీ ప్రస్తుతం తలస్తున్నది.

సమావేశ వివరాలు

హిట్లరు ముసోలినీ గార్లకు జరిగిన సమావేశం సాల్జుబర్గు సమీపమున గల జర్మను ప్రభుత్వ అతిథిగృహమందు జరిగినదని అధికారవార్తను విపులపరుస్తు సాల్జుబర్గునుండి వార్త దెలుపబడుచున్నది బుధవారం ఉదయమున ఇటలీ నియంత తవిదేశాంగమంత్రి కౌంటుకియానో గారితోను, సైనికసిబ్బంది ప్రధానోద్యోగి కౌంటు క్యావెలెరో గారితోను యింకా యితరరాజకీయ సైనిక ఉద్యోగులతోను సంభాషణలకై ఏర్పాటుచేయబడ్డ స్థలమునకు సమీపంగా నుండే ఒక చిన్నరైల్వే స్టేషనుకు అరుదెంచిరి.

ఇటలీ నియంతకు స్వయముగా స్వాగతమిచ్చిన హిట్లరుతో విదేశాంగమంత్రి వాన్ రిబెన్‌ట్రాపు, ఫీల్డు మార్షలు కీటెల్‌రీచ్ నాయకుడు బోర్మాన్ పక్షికాధిపతి డా॥ డీట్రిచ్‌రీచ్, ఖజానామంత్రి డా॥ షీల్ గార్లు నుండిరి.

హిట్లరు ముసోలినీగారిని అతిథిగృహమునకు తోడ్కొని వెళ్లిరి. అక్కడ స్టేటు మంత్రి డా॥ మిస్నెర్ గారు వారికరాకై కాచుకొనియుండిరి. నియంతలిరువురు కలిసి భోజించినతరువాత మధ్యాహ్నమున రాజకీయ విషయాల గూర్చి యిద్దరికి సంభాషణలు ప్రారంభమయ్యెను. వాన్ రిబెన్‌ట్రాఫ్, కౌంటుకియానోగార్లు పాల్గొనిరి. సాయంత్రం యిద్దరుకలిసి భోజనం చేసినమీదట మొదటిరోజు కార్యక్రమం ముగిసెను.

గురువారంనాడు సైనిక సంభాషణలందు పాల్గొనటానికి హిట్లరుతో కూడా ఫీల్డుమార్షల్ కీటెల్ గారు సమావేశమునకు వచ్చిరి. ఆసమావేశంలో జనరలుకౌంటు క్యావెలెరో, (బర్లిన్‌లో ఇటాలియను సైనిక ప్రతినిధి) జనరలు మారాస్, బ్రిగేడియరుజనరలు గ్యాండిన్ ఫీల్డుమార్షలుకీటెల్, ఫీల్డుమార్షలుకెస్సెలింగ్, ఆర్టిలెరిజనరలుజాడల్, బ్రోములో జర్మనుసైనికప్రతినిధిలెఫ్టెనెంటు జనరలువాన్ రిండెలెన్ గార్లు హాజరైరి. ఈసమయమునే, వాన్ రిబ్బెన్ ట్రాఫ్ కౌంటు కియానోగార్లు రాజకీయ సమస్యల సంభాషణలను కొనసాగించిరి. ఆసభకు బర్లిన్‌లోని ఇటాలియను రాయబారి సీఫాన్ ఆల్టోరీగారు రోములోని జర్మను రాయబారి వాన్ మాకెన్‌సన్ గారు హాజరైరి.

హిట్లరు ముసులోనీల సంభాషణలు తత్సంబంధమైన సైనిక రాజకీయ సంభాషణలు మధ్యాహ్నమున ముగిసెను.

జపానీయులను హెనెన్వీవద్ద తరిమివేయుట

చంకింగు, మే 2 —

హెనెన్వీకి ఉత్తరమున జపానీయులు తరిమివేయబడిరి. వారికి చాలా జననష్టంకలిగెను, అని అధికారరీత్యా తెలుపబడెను.

టాంగ్సీవద్ద జపానువారి నష్టం

లాయిలెం ఉత్తరమునున్న జపానీయులను వెనకనుండి చైనీయులు దెబ్బతీయుచున్నారు. టాంగ్సీయుద్ధంలో 1350 మంది జపానీయులు హతులైరి. 6 టాంకులు నాశన మొనర్పబడినవి. 21 మోటారుబండ్లు 10 మరఫిరంగులు, 700 తుపాకులను చైనీయులు పట్టుకొనిరి, అని అధికారప్రకటన తెలిపినది.

సింగ్యాంగు ఉత్తరమున శత్రువు చుట్టివేయబడెను

చెంగ్చీవద్ద జపానీయుల పలాయనము

షేన్సీ రాష్ట్రంలో జపాను విమానదాడులు

చంకింగు, మే 2:—

సింగ్యాంగునుండి వాయవ్యముగా నడచుచుండిన జపానుసేనలో ముఖ్యభాగమును ఆ పట్టణమునకు ఉత్తరంగా చైనీయులు చుట్టివేసిరి.

మినోకియాంగునవద్ద చైనీయబలములకు దాడులవల్లను, చెంగ్చీలో పక్కదాడులవల్లను జపానీయులు కష్టస్థితికి వచ్చి, దక్షిణదిశగా రెండువాహినులుగా పలాయనంకావలసి వచ్చెను. సింగ్యాంగు చుట్టు రస్తాలను, వంతెనలు చైనీయులు విస్తారంగా నాశనం చేసి, శత్రువును పలాయనమార్గం లేకుండ జేసిరి అని యుద్ధ క్షేత్ర వార్తలు తెలిపినవి

జపాను విమానదాడులు

కియాంగ్సీ రాష్ట్రంలో కియాంగ్‌సింకాంగ్ సాంగ్యా పట్టణములపైనను, షెన్సీరాష్ట్రంలో అనేకపట్టణములపైనను జపాను విమానదాడులు జరిగినట్లు తెలియుచున్నవి.

ఎమర్జెన్సీ కమిషన్లు అంగీకరించండి

ఆంధ్రడాక్టర్లకు లెఫ్టెనెంటు కర్నల్ శాస్త్రిగారి విన్నవం

శాస్త్రిగారికి గౌరవం

గుంటూరు, మే 1:—

ఈ మధ్యనే యుద్ధరంగాన్నుండి తిరిగివచ్చిన లెఫ్టెనెంటు కర్నల్ టి. శంకరశాస్త్రి గారు నిన్న సాయంత్రం దివ్యజ్ఞాన సమాజం లాడ్జిలో గుంటూరు మెడికల్ అసోసియేషనువారి ఆధ్వర్యాన జరిగిన సభలో మాట్లాడారు. ఆంధ్రదేశంలోని డాక్టర్లు ఎమర్జెన్సీకమిషన్లు అంగీకరించి యుద్ధసర్వీసులో చేరవలెననిరి. డి. ఎం. ఓ. శ్రీ సుబ్రహ్మణ్యం, సంఘసభ్యులు వచ్చారు. శాస్త్రిగారికాక సందర్భంలో టీపార్టీ ఏర్పాటు చేయబడ్డది. శ్రీ ఎం. సత్యనారాయణగారు శాస్త్రిగారిని పరిచయంచేస్తూ వీరు 1914 యుద్ధంలోనే గాక, ప్రస్తుత యుద్ధంలో కూడా పనిచేస్తూన్నవారనీ, చెప్పారు."

లెఫ్టెనెంటు కర్నల్ శాస్త్రిగారు తమకు గుంటూరునకు ఆహ్వానించినందులకు రాగణేశ్వరరావుగారికి కృతజ్ఞులమనిరి. తమతరవాత ర్యాంకులోని సబార్డినేటు ఆఫీసర్లు చాలమంది మద్రాసువారే ననిరి. భారతదేశానికి పేరు తెచ్చేట్లు అనుపమధైర్యంతో పోరాడుచున్న భారతీయ సైనికులే హెచ్చుగా తమ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారనిరి. ఆంధ్రదేశంనుంచి వార్ కమిషన్లలో తక్కువమంది డాక్టర్లు చేరినందుకు విచారము తెలిపిరి.

ఆంధ్రుల పూర్వమర్యాదకు, గౌరవానికి, సాంప్రదాయానికి అనుగుణంగా డాక్టర్లు వార్‌సర్వీసులోచేరి శత్రునాశనానికితోడ్పడవలెననిరి.

తమ కమిషనులో అనేక కులాలవారు ఉన్నారనీ, అంతా ఒకకుటుంబంలోని సోదరులవలె మెలగుచున్నామనీ, వార్‌సర్వీసులో జాతివిచక్షణ లేదనీ, ఇండియన్ సోల్జర్లు, బ్రిటిషు సోల్జర్లు ఒక కుటుంబంలోనివారివలె ఉంటున్నారనీ ఎక్కడైనా విచక్షణ, వ్యత్యాసం కనిపిస్తే వెంటనే చర్య గైకొనబడుతోందనీ చెప్పారు. తరువాత సూడాన్, అలెగ్జాండ్రియా, ఖార్టూం మొదలగు ప్రదేశాలలో తమ అనుభవాన్నిగూర్చి శ్రీ శాస్త్రిగారు కుతూహలము కలిగేటట్లుగ చెప్పారు.

డా॥ జి. వి. హనుమంతరావుగారి వందనాలతో సభ ముగిసింది. (స్వ. వి)

సర్ ఆర్ కే యస్ చెట్టిగారి రాక

మదరాసు, మే 2 —

సర్ ఆర్ కే షణ్ముగం చెట్టిగారు నిన్న సాయంత్రం గ్రాండు ట్రంకు ఎక్స్‌ప్రెసులో ఢిల్లీనుండి చెన్నపురికి వచ్చారు శ్రీయుతులు యస్. శివరాజ్ ఇ. వి. సుందరరెడ్డి విపళని స్వామినాయుడు, రామదాస్. యస్ వేణుగోపాలచెట్టి మున్నగువారు సెంట్రలు స్టేషనులో సర్ షణ్ముగం చెట్టిగారికి స్వాగతమిచ్చారు. సర్ షణ్ముగంగారు వేసేరి రత్నజిల్లాలో శ్రీ. ఆర్. రత్నసభాపతిగారితో బసచేస్తున్నారు. ఈ రాత్రి వారు కొయంబత్తూరుకు వెళ్తారు.

రెండవ రంగము ఆర్. ఏ. యఫ్. దాడులు

జర్మనుల ఆందోళన

వివిధ ఆలోచనలు

అంకారా, మే 2:—

విస్తారమైన భీమణము ఆర్. ఏ. యఫ్. దాడులును యూరోపులో రెండోరంగం ప్రారంభింపబడుననే భయము జర్మనీ విజయావకాశము విషయమున ప్రజలలో అధైర్యము కలిగించినదని బర్లిను నుండి వచ్చిన ప్రయాణికుల మూలమున తెలిసెను. యుద్ధంకంటె పరాజయము మేలని కొన్నిచోట్ల వాక్యములుకూడ చెక్కబడియున్నవని తెలుపబడుచున్నది. ఆర్. ఏ యఫ్. దాడులు జర్మనుల ధైర్యమునుచాలా తరకు చెడగొట్టుచున్నదని తటస్థులు అభిప్రాయం దెలుపుచున్నారు. అయినప్పటికి కొందరుమాత్రం జర్మనీకి విజయావకాశం యింకా కొంత యున్నదనియే తలుస్తూ కడపటి అవకాశమును హిట్లరు యివ్వవలసినదే యని తలచేవారుకూడా యున్నారు. వసంతకాల విజృంభిణ భగ్నమయ్యేయెడల జర్మను సైన్యము హిట్లరును అధికారంనుండి తొలగించి మిత్రమండలితో సాధ్యమైనంతవరకు రాజీచేసుకొనునని నమ్మబడుచున్నది

యూరోపులో రెండోరంగం సెలకొల్పబడుననేభయం ఆక్రమిత దేశాలలో తిరుగుబాట్లు లేవనెత్తునని ఎంచబడుచున్నది రెండోరంగములో యుద్ధమును ఆక్షురాజ్యాల సేనానులు ఎదుర్కొనలేరని వారినమ్మకము. రామెల్ సేనానికి సైనికులు యింకా సరఫరా మాత్రంపంపుట సాధ్యపడవచ్చునని మాత్రం విశ్వసింపబడుచున్నది జర్మనీలో కార్మికుల సంఖ్య తగినంతలేకుండా యిబ్బందిగానున్నది. 90 పౌగాకు ఫ్యాక్టరీలలో 60 ఫ్యాక్టరీలు మూయబడెను. యుద్ధసామగ్రి ఉత్పత్తిచేసే ఫ్యాక్టరీలందలి కార్మికులుకూడా చాలావరకు సైన్యములో చేర్చబడుటవల్ల యుద్ధపరిశ్రమలు సాగుటకు కూడా పనివారు చాలా తగ్గిపోవుచున్నారు కార్మికులను సైన్యములో చేర్చుకొనుటవల్ల యుద్ధసామగ్రి యుత్పత్తి నూటికి 15 నుండి 30 పాళ్లవరకు తగ్గినదని ఇస్తాంబుల్ వార్తాపత్రిక వ్రాస్తున్నది.

శ్రీ రాజగోపాలాచారికి ఢిల్లీలో నల్లజెండాలు

భవిష్యత్ కార్యక్రమం?

న్యూఢిల్లీ, మే 3—

శ్రీమాన్ సి. రాజగోపాలాచారి ఇవాళ ఉదయం అలహాబాదునుంచి ఢిల్లీవచ్చారు. హిందూమహాసభవారు నల్లజెండాలు చూపించారు.

రేపు ఉదయం ఆచారిగారు పత్రికలవాళ్లతో మాట్లాడుతారు. అప్పుడు మద్రాసు తీర్మానాల చరిత్రనంతను ఆయన వివరించి చెప్పవనుకుంటున్నారు.

ఆయన భవిష్యత్తునుగూర్చిగూడా చెప్పకపోతాడా అనిగూడా అనుకుంటున్నారు

తణుకు ఆడిషనలు జిల్లాముసనసబు ఉద్యోగము రద్దు

మదరాసు, మే 1:—

పశ్చిమగోదావరిజిల్లాలో తణుకు ఆడిషనలు జిల్లా మునసబు ఉద్యోగము రద్దు చేసి ఆక్కడ ఒకే మునసబు యిక మీదట అనగా మే 4 వ తేదినుండి నియమింపబడునట్లు హైకోర్టుతో ఆలోచించి గవర్నరుగారు ఉత్తర్వు గావించి యున్నారు.

ఉద్యోగ వార్తలు

మదరాసు, మే 2:—

శ్రీ ఏ. వి. సుబ్బయ్యపిళ్లగారు తాత్కాలిక డిప్యూటి కలెక్టరు ఫిబ్రవరి 15 వ తేదీ నుండి మదరాసు సివిలు సర్వీసు ఎగ్జిక్యూటివు బ్రాంచి పూర్తిసభ్యుడుగా ఉద్యోగమందు విరమించిన శ్రీ కే. యస్. నారాయణఅయ్యరు బదులు నియమింపబడిరి.

శ్రీ కె. శ్రీనివాసన్

మద్రాసు, మే 3.—

అ. భా. వార్తాపత్రికల స్థాయిసంఘాధ్యక్షుడగు శ్రీ కె. శ్రీనివాసన్ గారు ఇవాళ ఉదయం గ్రాండుట్రంకు ఎక్స్‌ప్రెస్‌లో ఢిల్లీలో 6 వ తేదీన జరగబోవు స్థాయి సంఘసభకు హాజరగుచున్నారు శ్రీ సి. ఆర్ శ్రీనివాసన్ గూడా ఆదేరైలులో ఢిల్లీ వెళ్లుచున్నారు.

యుద్ధనిధి

మదరాసు, మే 1:—

ఇంతవరకు గవర్నరు యుద్ధనిధి 2,02,54,899 8 0 వరకు చేరినది.

కలకత్తాలో ట్రాంవేవనివారి సమ్మె

కలకత్తా, మే 2.—

కలకత్తా ట్రాంవేవనివారలు యీదినం మధ్యాహ్నం సమ్మెచేసినందున ప్రజల రాకపోకలకు చాలాయిబ్బందికలిగెను. ముందుగా అధికారుల ఉత్తరువు పొందక గైరు హాజరైన నౌకపనివానిని తొలగించినందుకు అసమ్మతిగా పనివారు సమ్మెచేశారని తెలుస్తున్నది. సమాధానం కుదుర్చుటకు అధికారులు యత్నిస్తున్నారు. త్వరలో తిరిగి ట్రాము బండ్లు నడువగల్గునని వారు ఆశిస్తున్నారు.

అమెరికారాయబారి విషీనుండి బయల్దేరుట

విషీ, మే 2:—

అమెరికా రాయబారి ఆడ్మిరలు లీహే గారు నిన్నరాత్రి విషీనుండి అమెరికాకు బయల్దేరిరి.

లండను మార్కెట్టు

(రూ. స్పె. కేబిల్)

లండను, మే 2 —

డబ్బు మార్కెటులో మాసాంతమగుట చేత బుణాలకు కావలసినంత ధనం దొరకలేదు. రాబోవువారపు ట్రెజరీబిల్లులకు 14 కోట్లు 80 లక్షల మొత్తానికి దరఖాస్తులు అందెను. అందు 7½ కోట్లు సరాసరి 1 పౌను 0.80 పెన్నీల రేటుతో అంగీకరింపబడెను. రాబోవువారానికి 8½ కోట్ల పౌనులు బ్యాంకులు ఫెల్లించాలని కోరబడియున్నది. వాల్‌స్ట్రీటు వ్యాపారం తక్కువలో నిలకడతో నుండెను.

విదేశధరలు

(రూటరు ప్రత్యేకసర్వీస్)

లండను మారకము

లండను, మే 2:—

	కడపటిధర	నేటిధర
లండను-న్యూయార్కు	4.02-1/2	4.02-1/2
,,	4.08½	4.08½
,, మాడ్రిడ్	40.5	40.5
,, మాంట్రియల్	4.43/4.47	4.43/4.47
,, బెర్లిన్	17.8/17.4	17.8/17.4
,, బొంబాయి(కొ)	1/5-31/32	1/5-31/32
,, బొంబాయి (వి)	1/6-1/32	1/6-1/32

న్యూయార్కు డూది

న్యూయార్కు, మే 2:—

	శుక్రవారము క్లోజింగు	శనివారము క్లోజింగు
మే 1942	19.22/19.22	19.18/19.18
జూలై	19.45/19 45	19.42/19.43
అక్టోబరు	19.66/19.66	19.63/19.63
డిసంబరు	19.75/19.76	19.77/19.78
జనవరి	19.78/19.78	19.80/19 80
మార్చి	19.89/19.